teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 02 | సంచిక : 406 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 19 జూన్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## విడుదలైన పీజీఈసెట్ 2024 ఫలితాలు

18వేల 829 మంది విద్యార్థులు ఉత్తీర్ణత




.. వివరాలు 2లో



## రాష్ట్రానికి బీఆర్ఎస్ నాయకత్వం అవసరం

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

**పార్టీని కాపాడుకునేందుకు కేసీఆర్ కృషి చేయాలని విజ్ఞప్తి**

యాదాద్రి, జూన్ 18 (తీన్మార్ న్యూస్): రాష్ట్రానికి బీఆర్ఎస్ నాయకత్వం అవసరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ బతికే ఉండాలని వ్యాఖ్యానించారు. యాదగిరిగుట్టలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కూనంనేని మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని కాపాడుకునేందుకు కేసీఆర్ కృషి చేయాలని మిగతా 2 లో



## అభివృద్ధి పేరుతో కేసీఆర్ సర్కార్ నిబంధనల ఉల్లంఘన

**కేంద్రం చెప్తున్నా కేసీఆర్ తొందర పాటు**

**జనసమితి అధినేత కోదండరాం విమర్శలు**

హైదరాబాద్, జూన్ 18 (తీన్మార్ న్యూస్): కేసీఆర్ సర్కార్ అభివృద్ధి పేరుతో నిబంధనలను ఉల్లంఘించిందని తెలంగాణ జనసమితి అధినేత కోదండరాం చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చెప్తున్నా కేసీఆర్ తొందర పాటు నిర్ణయం మిగతా 2 లో




# ప్రీ స్కూల్స్‌గా మారుతున్న అంగన్‌వాడీలు

## పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి ప్రణాళికలు

## ఈ ఏడాదే అమలుకానున్న పూర్వ ప్రాథమిక విద్య

**స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలోనే ప్రీస్కూల్స్ నిర్వహణ**

**నిర్వహణ, విద్యాబోధనపై టీచర్స్ కు శిక్షణ**

**ఈనెల 21న శిక్షణ తరగతులకు షెడ్యూల్ ఖరారు**



జగిత్యాల, జూన్ 18 (తీన్మార్ న్యూస్): పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ప్రణాళికలో భాగంగా రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్స్‌గా తీర్చిదిద్దేందుకు సర్కార్ నిర్ణయించింది. ఈ విద్యను ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేయనుంది ప్రభుత్వం. ప్రభుత్వ పాఠశాలల






## నిరుద్యోగులంతా ఐటీఐలో చేరాలని సీఎం సూచనలు

**సర్టిఫికెట్ ఉంటే సరిపోదు.. నైపుణ్యం ఉండాలి**

రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది నిరుద్యోగులంతా ఐటీఐలో చేరాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మంగళవారం మల్లేపల్లి ఐటీఐలో ఏటీసీలకు శంకుస్థాపన చేసిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ఐటీఐల్లో నేర్పించే నైపుణ్యాలు విద్యార్థులకు ఉపయోగం లేకుండాపోయాయని వెల్లడించారు.

హైదరాబాద్, జూన్ 18 (తీన్మార్ న్యూస్): 40, 50 ఏళ్ల కింది నైపుణ్యాలను ప్రస్తుత ఐటీఐలో నేర్పిస్తున్నారని అన్నారు. 40 లక్షల మంది యువతీ-యువకులు ఉపాధి లేక రిక్రూట్‌మెంట్ బోర్డుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. సర్టిఫికెట్ ఉంటే సరిపోదని నైపుణ్యం ఉండాలని తెలిపారు. సాంకేతిక నైపుణ్యం ఉంటేనే ఉపాధి లభిస్తుందని వెల్లడించారు. ఇల్లు కట్టడానికి సివిల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్స్ కంటే మేస్త్రి ఎక్కువ మిగతా 2 లో

## 2లక్షల ఉద్యోగాలను భర్తీకి రాష్ట్ర సర్కార్ ప్లాన్

**వీఆర్ఏ, వీఆర్ఓ స్థానంలో కొత్త పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు**

**జాబ్ క్యాలెండర్ రూపకల్పనకు అడుగులు**

తెలంగాణ బ్యూరో, జూన్ 18 (తీన్మార్ న్యూస్): అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు రాష్ట్ర సర్కారు ప్లాన్ చేస్తున్నది. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్స్‌కు మిగతా 2 లో



## ఆర్డీఓలు, తహసీల్దార్లకు ధరణి పోర్టల్ లాగిన్‌కు నిర్ణయం

**రెవెన్యూ ఆఫీసుల్లో ధరణి సమస్యలపై ప్రత్యేక డ్రైవ్**

**కార్యాలయాల్లో డ్యాష్ బోర్డులు ఏర్పాటుచేయాలని ఆదేశాలు**





తెలంగాణ బ్యూరో, జూన్ 18 (తీన్మార్ న్యూస్): గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూముల లావాదేవీల కోసం ధరణి పోర్టల్ అందుబాటులోకి తెచ్చింది. అయితే ధరణి అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిపై ఓ కమిటీ వేసింది. ఈ కమిటీ ధరణి పోర్టల్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టింది. ధరణి మిగతా 2 లో




## విడుదలైన 17వ విడుత పీఎం కిసాన్ నిధులు

**9.3 కోట్ల మంది రైతులకు చేకూరనున్న ప్రయోజనం**

న్యూ ఢిల్లీ, జూన్ 18 (తీన్మార్ న్యూస్): ప్రధాని నరేంద్ర మోడీ పీఎం కిసాన్ నిధులు విడుదల చేశారు. 9.3 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరేలా దాదాపు రూ.20,000 కోట్లతో పీఎం-కిసాన్ 17వ విడతను వారణాసి వేదికగా విడుదల చేశారు. అలాగే పాక్షిక విస్తరణ కార్మికులుగా పనిచేసేందుకు వ్యవసాయ (కృషి) సఖి శిక్షణ పొందిన 30,000 మందికిపైగా స్వయం మిగతా 2 లో




## వైద్య శాఖలో మొదలైన ప్రక్షాళన

**ప్రతి 35 కి.మీకి ఒక ట్రామా సెంటర్**

**కొత్తగా 75 ట్రమా కేర్ సెంటర్లు ఏర్పాటు**

**ఒకటి రెండు ఏళ్లలో స్థిరమైన మార్పులు**

**వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా**

హైదరాబాద్, జూన్ 18 (తీన్మార్ న్యూస్): వైద్య శాఖలో ప్రక్షాళన మొదలైందని, ఒకటి రెండు ఏళ్లలో స్థిరమైన మార్పులు కనిపిస్తాయన్నారు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర మిగతా 2 లో

## టీఎస్ఎస్‌పీడీసీఎల్ విద్యుత్ వివాదానికి శుభం కార్డు




**సుమారు రూ.1.64 లక్షల విద్యుత్ బిల్లు బకాయిలు చెల్లింపులు**

**హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు**

.. వివరాలు 2లో

## అటెండెన్స్ పడ్డాక ఆఫీసు దాటితే ఉపేక్షించేది లేదు



**సమయ పాలన పాటించని ఉద్యోగులపై కఠిన చర్యలు**

**భూగర్భ గనుల్లో రోజూ తనిఖీ చేయాలి**

**బొగ్గు ఉత్పత్తి పై ప్రత్యేక దృష్టి సారించిన సంస్థ ఛైర్మన్, ఎండీ**

.. వివరాలు 2లో

## దేశవ్యాప్తంగా కొద్దిసేపు నిలిచిపోయిన జియో సేవలు

**నెట్ వర్క్ ఫెయిల్ పై క్లారిటీకి అధికారికంగా స్పందించాల్సి ఉంది**




.. వివరాలు 2లో

## రేవంత్ రెడ్డి పాలన పడకేసింది అనుకున్నాం.. కానీ అటకెక్కింది

**పిఆర్ స్టంట్ మీద ఉన్న సోయి ప్రజా సమస్యలపై లేదు**

**రేవంత్ నాయకత్వంపై బీఆర్ఎస్ నేత రాకేష్ రెడ్డి సంచలన వాఖ్యలు**



వరంగల్, జూన్ 18 (తీన్మార్ న్యూస్): రేవంత్ రెడ్డి నాయకత్వంలో పాలన పడకేసింది అనుకున్నాం.. కానీ అటకెక్కిందన్నారు బీఆర్ఎస్ నేత రాకేష్ రెడ్డి. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి పిఆర్ స్టంట్ మీద ఉన్న సోయి ప్రజా సమస్యలు పరిష్కరించడంలో లేదని, ఆశా వర్కర్లు, మిగతా 2 లో

## తెలంగాణలో టీడీపీ అధికారంలోకి వస్తుంది

**ధీమా వ్యక్తం చేసిన నారా భువనేశ్వరి**

**తెలంగాణలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేస్తాం**

**ట్విట్టర్ వేదికగా నారా భువనేశ్వరి ట్వీట్**



.. వివరాలు 2లో

# నిరుద్యోగులంతా ఐటీఐలో చేరాలని సీఎం సూచనలు

**మొదటి పేజీ తరువాయి**

డబ్బులు అడిగాడని రేవంత్ రెడ్డి తెలిపారు. సైట్ సూపర్ వైజర్ కోసం ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్స్, సివిల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్స్ నెలకు రూ. 15000 ఇవ్వండి మేము పని చేస్తాం అన్నారు. అదే మేస్త్రి నెలకు రూ. 60000 ఇవ్వండి పని చేస్తా అని అన్నారని వెల్లడించారు. అందుకే నిరుద్యోగులు, విద్యార్థులు ఐటీఐలో చేరాలని రేవంత్ రెడ్డి సూచించారు. ఇక ఆయన మాటలు విన్న నిరుద్యోగులు పీహెచ్‌డీలు చేసిన మేము ఐటీఐ చేయాలా అని ప్రశ్నిస్తుంటే మరికొందరేమో ఐటీలో ఉద్యోగాలు ఇప్పించే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని వదిలేసి, ఐటీఐలో చేరమని చెప్పే ప్రభుత్వాన్ని తెచుకున్న దుస్థితికి రాష్ట్రం వచ్చిందని అంటున్నారు.

# 2లక్షల ఉద్యోగాలను భర్తీకి రాష్ట్ర సర్కార్ ప్లాన్

**మొదటి పేజీ తరువాయి**

అనుగుణంగా వాటికి కొత్త పోస్టులు చేర్చి, మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చే విధంగా ఆలోచన చేస్తున్నది. ఇందులో భాగంగానే గ్రూప్–1 లో పోస్టుల సంఖ్యను కూడా పెంచింది. ఇప్పుడు పోలీసు, టీచర్, గురుకుల, వివిధ పోస్టుల భర్తీతోపాటు ప్రభుత్వ విభాగాల్లో గ్రూప్– 2, 3,4 కు సంబంధించి జాబ్ క్యాలెండర్ రూపకల్పన చేస్తున్నది. రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో వీఆర్ఏ, వీఆర్ఓ పోస్టులను తీసేయడంతో వాటి స్థానంలో కొత్త పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు పంపాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో రెవెన్యూ విషయంలో గ్రామానికి ఒక అధికారి ఉండేలా మరిన్ని పోస్టులను కొత్త ప్రభుత్వం క్రియేట్‌చేయాలనుకుంటున్నది. ఏటేటా రిటైర్మెంట్ అవుతున్న కొద్దీ వెంటనే అవసరాల మేరకు ప్రమోషన్లు ఇస్తూ, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌పోస్టుల భర్తీకి చర్యలు తీసుకునేలా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఇక అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకూ 30 వేలకు పైగా మందికి ప్రభుత్వం ఉద్యోగ నియామక పత్రాలను అందించింది. మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్‌మెంట్‌బోర్డు పరిధిలో 6,956 స్టాఫ్‌నర్స్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అధ్వర్యంలో 14,099 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేసింది. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలకు ఎంపికైన 7,800 మంది టీచర్లు, లెక్చరర్లకు నియామక పత్రాలను అందించింది. టీజీపీఎస్సీ అధ్వర్యంలో చేపట్టిన రిక్రూట్‌మెంట్ ద్వారా 87 పోస్టులను భర్తీ చేసింది. ఇదిలా ఉంటే గతంలో ఎన్నడూ లేని విధంగా మెగా డీఎస్సీని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 11,062 టీచర్ పోస్టుల భర్తీకి ఈ నోటిఫికేషన్ జారీ చేసింది.

## రాష్ట్రానికి బీఆర్ఎస్ నాయకత్వం అవసరం

**మొదటి పేజీ తరువాయి**

విజ్ఞప్తి చేశారు. అన్ని పార్టీల సహకారంతో సీఎం రేవంత్ రెడ్డి పాలన కొనసాగించాలని కోరారు. ప్రభుత్వంలో భాగమైనా ఉద్యమాలు, పోరాటాలు ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాస్వామ్యాన్ని గౌరవించే వ్యక్తి కాదని, పదవి కోసం దిగజారే వ్యక్తి అని కూనంనేని విమర్శించారు. దేశంలో 400 సీట్ల వస్తాయని చెప్పిన ఆయనకు ప్రజలు సరైన రీతిలో బుద్ధి చెప్పారని, అధికారం కోల్పోయే దశకు బీజేపీ పార్టీ చేరిందని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ ఆ పార్టీ సిద్ధాంతాలను మరిచాయని, ఇతర పార్టీ నాయకులను చేర్చుకొని అధికారంలోకి వచ్చాయని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ మాదిరిగా అధికార దాహంతో సీపీఐ పార్టీ ఉండబోదని, సమాజాన్ని చైతన్య పరిచేది సీపీఐ మాత్రమేనని తెలిపారు.

# అభివృద్ధి పేరుతో కేసీఆర్ సర్కార్ నిబంధనల ఉల్లంఘణ

**మొదటి పేజీ తరువాయి**

వల్ల ఛత్తీస్ గడ్ ఒప్పందాలు చేసుకున్నారని అన్నారు. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్స్ ఏర్పాటు చేశారని చెప్పారు. పోలవరం పూర్తి అయితే భద్రాద్రి పవర్ ప్లాంట్ మునుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి ప్రభుత్వం ఖర్చులు తగ్గించుకునే ప్రయత్నం చేయలేదన్నారు. కేసీఆర్ అనుసరిస్తున్న పద్ధతి కరెక్ట్ కాదని, ఇప్పటికీ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఆర్థిక పరమైన అంశాల్లో కేసీఆర్ కొద్ది మందికే లాభం చేకూరే విధంగా నిర్ణయాలు ఉన్నాయన్నారు.

## ఆర్డీఓలు, తహసీల్దార్లకు ధరణి పోర్టల్ లాగిన్ కు నిర్ణయం

**మొదటి పేజీ తరువాయి**

పోర్టల్ సాంకేత సమస్యలతో రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతున్న రైతులు, భూయజమానులకు ప్రభుత్వం ఓ గుడ్ న్యూస్ చెప్పింది. ధరణిలోని భూసమస్యలకు పరిష్కారానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో పలు జిల్లాల్లో రెవెన్యూ యంత్రాంగం రంగంలోగి దిగింది. భూసమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయి పర్యటనలతో పాటు పాత దస్త్రాలను పరిశీలించాలని రెవెన్యూశాఖ అధికారులు నిర్ణయించుకున్నారు. ధరణి సమస్యలపై కలెక్టర్లతో ఇటీవల సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల వారీగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి జూన్ చివరి నాటికి సమస్యల పరిష్కారాన్ని ఓ కొలిక్కి తీసుకోవాలని ఆదేశించారు. అయితే గతంలో ధరణి సమస్యలు పరిష్కరించేందుకు కలెక్టర్లకు మాత్రమే అధికారం ఉండేది. ధరణి దరఖాస్తులు పెద్ద సంఖ్యలో ఉండడంతో జాప్యం జరగకుండా ఉండేందుకు ఆర్డీఓలు, తహసీల్దార్లకు ధరణి పోర్టల్ లాగిన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. జీఎల్ఎం, టీఎం–33, మిస్సింగ్ సర్వే నంబర్లు, భూమి హెచ్చుతగ్గులు, నిషేధిత జాబితాలోని భూములు, వారసత్వ భూములు, నాలా కన్వర్షన్, ఎన్నారైల భూములు, కోర్టు కేసుల్లోని భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ఆర్డీఓలు, తహసీల్దార్లు బాధ్యతలు అప్పగించింది. రెవెన్యూ ఆఫీసుల్లో ధరణి సమస్యలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. డ్యాష్ బోర్డులు ఏర్పాటు చేసి ఏ తరహా భూ సమస్యలు ఎక్కువగా పెండింగ్ లో ఉన్నాయని స్పష్టం చేస్తూ రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కలెక్టరేట్‌తోపాటు ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో డ్యాష్ బోర్డులు ఏర్పాటుచేయాలని ఆదేశించింది. దరఖాస్తుల పెండింగ్‌కు కారణాలను డ్యాష్ బోర్డుల్లో ప్రజలకు తెలియజేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ నెలాఖరు నాటికి పెండింగ్ దరఖాస్తులకు ఓ పరిష్కార మార్గం చూపాలని రెవెన్యూ యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత దరఖాస్తుల పరిష్కారం అయితే మరోసారి దరఖాస్తుల ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది.

# దేశవ్యాప్తంగా కొద్దిసేపు నిలిచిపోయిన జియో సేవలు

న్యూ ఢిల్లీ, జూన్ 18 (తీన్మార్ న్యూస్): దేశవ్యాప్తంగా మరోసారి జియో సేవలు కొద్దిసేపు లిచిపోయినట్లు తెలుస్తుంది. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల మధ్య ప్రాంతంలో ఒక్కసారి జియో నెట్ పనిచేయడం ఆగిపోయింది. దీంతో యూజర్లు కాసేపు ఏమౌతుందో అర్థకాక ఫోన్లు రీ స్టాట్ చేయడం, ఏరోప్లేన్ మోడ్ ఆన్ చేసి, ఆన్ చేయడం చేశారు. కానీ ఎంతకు నెట్ వర్క్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తున్నారు. కాగా జియో సర్వర్ డౌన్ అయిందా లేక ఇతర టెక్నికల్ సమస్యలు తలెత్తాయ అనే విషయాలు ఇంకా తెలియరాలేదు. నెట్ వర్క్ ఫెయిల్ పై క్లారిటీ రావాలంటే జియో అధికారికంగా స్పందించాల్సి ఉంది.

## వైద్య శాఖలో మొదలైన ప్రక్షాళన

**మొదటి పేజీ తరువాయి**

రాజనర్సింహ. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ కిట్ లో మార్పులు, ప్రతి 35 కిలోమీటరు కి ఒక ట్రామ సెంటర్, కొత్తగా 75 ట్రమా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డయగ్నోస్టిక్ సెంటర్లు ప్రభుత్వ ఆస్పత్రులకు లింక్ చేసే విధంగా చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. 3 రకాల టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేయబోతున్నామని, ప్రైవేటు ఆస్పత్రుల పర్యవేక్షణ ( క్లినికల్ ఎస్టాబ్లిష్ ) అని ఆయన వ్యాఖ్యానించారు. ఫార్మా మెడికల్ కోసం (డ్రగ్స్ నియంత్రణ ) ఫుడ్ క్వాలిటీ కోసమని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కోసం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రాంతాల వారీగా సర్వే చేయకుండా అవసరం లేకుండా ఇచ్చారని, మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్లు కూడా దొరకని పరిస్థితి అని ఆయన అన్నారు. మెడికల్ ప్రొఫెషన్ స్లో గా పెరగాలన్నారు. కేసీఆరే డాక్టర్ అయ్యాడు, కేసీఆరే ఇంజనీర్ అయ్యాడని ఆయన సెటైర్లు వేశారు. కరోనా కు పారాసిటామాల్ అన్నారు. కాళేశ్వరం ఆయన్నే డిజైన్ చేశారన్నారు. హైదరాబాద్ లో 4 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల కోసం 9 వేల కోట్ల రూపాయలు లోన్ రూపంలో తీసేసుకున్నారని, 21 అంతస్తుల నుంచి 14 అంతస్తులకు తగ్గించామన్నారు దామోదర రాజనర్సింహ. వైద్య రంగంలో రెగ్యులేటరీ పవర్స్ అమలు చేద్దామన్నారు దామోదర రాజనర్సింహ. గత ప్రభుత్వ తీరుపై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విమర్శలు తెలిపారు. సిద్దిపేట ఆస్పత్రిపై దృష్టి పెట్టి ఉస్మానియా ఆస్పత్రిని పట్టించుకోలేదని, పదేళ్లు పాలించి కనీసం ఉస్మానియా ఆస్పత్రిని కొత్తగా కట్టలేదన్నారు. సిటికి పక్కనే ఉన్న మహేశ్వరంలో మెడికల్ కాలేజీ ఎందుకు ఇచ్చారో తెలియదన్నారు దామోదర రాజనర్సింహ. ఇంజనీరింగ్ కాలేజీల మాదిరిగా మెడికల్ కాలేజీలు కుప్పకూలిపోయే ప్రమాదం పొంచి ఉందన్నారు.

# ప్రీ స్కూల్స్‌గా మారుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు

**మొదటి పేజీ తరువాయి**

ప్రాంగణంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా ఎంపిక చేశారు. వీటిల్లో నిబంధనల ప్రకారం మార్పులు చేస్తున్నారు. పెయింటింగ్‌తో పాటు ఇతర పనులు చేపడుతున్నారు. మోడల్ కేంద్రాల మాదిరిగా తీర్చిదిద్దుతున్నారు. దీనికి అనుగుణంగా ముందస్తుగా సూపర్‌వైజర్లకు సంబంధిత విద్యా బోధనపై శిక్షణ అందించడం జరిగింది. ఈ వారంలో అంగన్వాడీ కేంద్రాల టీచర్లకు కూడా శిక్షణ ఇచ్చేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. పిల్లల్లో క్రమశిక్షణతో పాటు తారతమ్యం లేకుండా ఉండేలా యూనిఫాం అమలు చేయనుంది. కాగా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలోనే ప్రీస్కూల్స్ నిర్వహణ చేపట్టనున్నారు.



**ప్రీస్కూల్ నిర్వహణ, విద్యాబోధనపై శిక్షణ**

ప్రీస్కూల్ నిర్వహణ, విద్యాబోధనపై ఈ ఏడాది మార్చిలోనే సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. కాగా ఎంపికైన 340 కేంద్రాల అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మాస్టర్ ట్రైనర్లు అయిన సూపర్‌వైజర్ల ద్వారా టీచర్లకు శిక్షణ ఉంటుందని అధికారులు తెలిపారు. ఈనెల 21వ తేదీన శిక్షణ తరగతులను ప్రారంభించడానికి షెడ్యూల్ ఖరారు చేశారు. ఒక్కో బ్యాచ్‌లో 35 మంది అంగన్ వాడీ టీచర్లకు శిక్షణ ను ఇవ్వనున్నారు. జిల్లాలో 29 బ్యాచ్‌లను ఏర్పాటు చేసి శిక్షణను ఇవ్వడానికి నిర్ణయించారు. అంగన్ వాడీ టీచర్లు శిక్షణను పూర్తి చేసుకున్న అనంతరం ప్రీ స్కూల్స్ నిర్వహణను లక్ష్యం మేరకు చేపట్టడానికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు సమాయత్తం అవుతున్నారు.

**జిల్లా వ్యాప్తంగా 1,065 అంగన్‌వాడీ కేంద్రాలు**

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 1,065 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలలో నమోదు ఐన గర్భిణులు, బాలింతలు 12,394 మంది గాను, ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలు 34,748 మంది గాను, మూడు నుంచి అయిదేళ్లలోపు పిల్లలు 13,969 మంది గాను ఉన్నట్లు సమాచారం.

**విద్యాబోధనలో మార్పులు**

ఇప్పటి వరకు అంగన్ వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం అందించి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆట, పాటలతో విద్యా బోధన చేపడుతున్నారు. అయితే ప్రీ స్కూల్‌లో మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలుగా ప్రేరణాత్మక, కృత్యధార బోధన ఉంటుందని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. జూన్ నుంచి ఆగస్టు వరకు ఆట పాటలు, ప్రకృతి, సైన్స్, యోగా, పూర్వగణితం, రంగులు ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తారు. ప్రతీరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ కార్యక్రమాలతో పాటు కృత్యాలతో పిల్లలకు విద్యా బోధన చేస్తారు. నాలుగో శనివారం పూ ర్వ ప్రాథమిక విద్యాదినోత్సవం జరిపి కృత్యాలు, కార్యక్రమాలను ప్రదర్శి స్తారు. పిల్లల్లో వచ్చిన మార్పులు, అభివృద్ధిని తల్లిదండ్రులకు తెలియజేస్తారు.

# విడుదలైన 17వ విడుత పీఎం కిసాన్ నిధులు

**మొదటి పేజీ తరువాయి**

సహాయ సంఘాల మహిళలకు ధ్రువీకరణ పత్రాలను కూడా ప్రధానమంత్రి ప్రదానం చేశారు. ఉత్తరప్రదేశ్ గవర్నర్ శ్రీమతి ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ సహా పలువురు రాష్ట్ర మంత్రులు కూడా పాల్గొన్నారు.

**2.5 కోట్ల మందికిపైగా రైతులు.**

దేశవ్యాప్తంగా గల 732 వ్యవసాయాభివృద్ధి కేంద్రాలు (కెవికె), లక్షకుపైగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, 5 లక్షల సార్వత్రిక సేవా కేంద్రాల ద్వారా మొత్తం 2.5 కోట్ల మందికిపైగా రైతులు కూడా వాస్తవిక సాదృశ మాధ్యమం ద్వారా ఇందులో పాలుపంచుకుంటారు. మరోవైపు ఎంపిక చేసిన 50 కెవికె లలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలోనూ రైతులు గణనీయ సంఖ్యలో పాల్గొంటారు. ఈ సందర్భంగా పలువురు కేంద్రమంత్రులు ఆయా కేంద్రాలను సందర్శించి రైతులతో సంభాషిస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే రైతులకు ఉత్తమ వ్యవసాయ పద్ధతులు, ఈ రంగంలో వర్ధమాన కొత్త సాంకేతికతలు, వాతావరణ ప్రతికూలతలను తట్టుకోగల వ్యవసాయం తదితరాలపై అవగాహన కల్పిస్తారు.

స్టేటస్ ఇలా చెక్ చేసుకోండి:

ముందుగా పీఎం కిసాన్ అధికారిక వెబ్‌సైట్‌ను (https://pmkisan.gov.in సందర్శించాలి. పేజీ కుడి వైపు 'నో యువర్ స్టేటస్ ట్యాబ్‌పై క్లిక్ చేసి మీ రిజిస్ట్రేషన్ నంబర్‌ను నమోదు చేసి, క్యాప్చా కోడ్ ఎంటర్ చేయండి. మీ ఎంపికను ఎంచుకుంటే మీ స్టేటస్ డిస్‌ప్లే అవుతుంది. ఆ తర్వాత జాబితాలో పేరు తనిఖీ ఇలా చూసుకోండి. పీఎం కిసాన్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి అందులోని 'బెనిఫిషియరీ లిస్ట్' ట్యాబ్‌పై క్లిక్ చేయాలి. తర్వాత డ్రాప్–డౌన్ నుంచిరాష్ట్రం, జిల్లా, ఉప–జిల్లా, బ్లాక్, గ్రామం వంటి వివరాలను ఎంచుకోవాలి. అనంతరం 'గెట్ రిపోర్ట్' ట్యాబ్‌పై క్లిక్ చేయాలి. వెంటనే లబ్ధిదారుల జాబితా వివరాలు డిస్‌ప్లే అవుతాయి. ఈ–కేవైసీ పీఎం–కిసాన్ వాయిదాలను స్వీకరించడానికి రైతులు తప్పనిసరిగా వారి ఈ–కేవైసీ పూర్తి చేయాలి. ఈ పథకానికి సంబంధించిన అధికారిక వెబ్‌సైట్ ప్రకారం పీఎం–కిసాన్ నమోదిత రైతులకు ఈ–కేవైసీ తప్పనిసరి. ఓటీపీ ఆధారిత ఈ–కేవైసీ పీఎం కిసాన్ పోర్టల్‌లో అందుబాటులో ఉంది. బయోమెట్రిక్ ఆధారిత ఈ–కేవైసీ కోసం సమీప సీఎస్‌సీ కేంద్రాలను సంప్రదించవచ్చు.

# విడుదలైన పీజీఈసెట్ 2024 ఫలితాలు

హైదరాబాద్, జూన్ 18 (తీన్మార్ న్యూస్): జేఎన్టీయూ యూనివర్సిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఎంటెక్, ఎంఫార్మసీ, ఎం టెక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన పీజీఈసెట్ 2024 ఫలితాలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఛైర్మన్ ఆర్.లింబాద్రి ఎగ్జామ్ కన్వీనర్ అరుణకుమారి విడుదల చేశారు. జూన్ 10వ తేదీ నుండి 13వ తేదీ వరకు నిర్వహించిన ఈ పరీక్షల్లో 20వేల 626 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 18వేల 829 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పరీక్ష నిర్వహించిన 4రోజుల్లోనే ఫలితాలను విడుదల చేశారు అధికారులు. హైదరాబాదులో 8 సెంటర్ల తో పాటు వరంగల్ లో 7 సెంటర్లలో 19 బ్రాంచ్ లకు సంబంధించి ఈ పరీక్షను నిర్వహించడం జరిగిందని త్వరలోనే అధికారులతో చర్చించి కౌన్సిలింగ్ తేదీలను ప్రకటిస్తామని ఉన్నత విద్యా మండలి ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు రెక్టార్ విజయ్ కుమార్ రెడ్డి తో పాటు ఉన్నత విద్యా మండలి అధికారులు యూనివర్సిటీ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

# అటెండెన్స్ పడ్డాక ఆఫీసు దాటితే ఉపేక్షించేది లేదు

తెలంగాణ బ్యూరో, జూన్ 18 (తీన్మార్ న్యూస్): సింగరేణిలో ఇప్పటి వరకు బొగ్గు ఉత్పత్తి పై ప్రత్యేక దృష్టి సారించిన సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్ బలరామ్ ఇప్పుడు కంపెనీలో పని సంస్కృతిని పెంచేందుకు కీలక చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా కార్యాలయాల్లో ఉద్యోగులు, అధికారుల సమయ పాలనపై ప్రత్యేక దృష్టి సారించారు. గనులు, కార్యాలయాల్లో పనిచేస్తున్న కొందరు డ్యూటీలకు రాకున్నా కూడా మస్టర్ పడుతున్నట్లు మరి కొందరు మస్టర్ పడి బయటకు వెళ్తున్నట్లు నిఘా వర్గాల ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ఆయన తీవ్రంగా స్పందించారు. అలాగే భూగర్భ గనుల్లో పని ప్రదేశాలను సంబంధిత అధికారులు రోజూ తనిఖీ చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. సింగరేణిలో ఉద్యోగులు, అధికారులంతా కూడా ఇకపై రోజూ తప్పనిసరిగా బయోమెట్రిక్ అటెండెన్స్ నమోదు చేసుకోవాలని.. దీనిపై ఆయా ఏరియా జీఎంలు, విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే భోజన విరామం పూర్తయిన తర్వాత నిర్ణీత సమయంలో మళ్లీ సీట్లలో కూర్చొని పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లంచ్ బ్రేక్‌లో చాలా మంది మూడు గంటల పాటు విరామం తీసుకోవడం ద్వారా తమ పనులు/ ఫైళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయని పలువురు సీఎండీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన సెక్యూరిటీ విభాగం ద్వారా నివేదికలు తెప్పించుకున్నారు. గతంలో సింగరేణి ఆస్పత్రులలో, డిస్పెన్సరీలలో వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు రాకపోతే మెమోలు జారీ చేసిన ఆయన ఇప్పుడు సమయ పాలనను పాటించని వారిపైనా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. సింగరేణిలోని ప్రతి ఉద్యోగి, అధికారి కచ్చితమైన సమయపాలన పాటించాలని, డ్యూటీలో చేరిన తర్వాత బయటకు వెళ్ళటం గాని, పని చేయకుండా కూర్చోవడం గాని చేయకూడదన్నారు. ఈ విషయంలో ఎంతటి పెద్ద వారైనా, పలుకుబడి ఉన్నవారైనా సరే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# టీఎస్ఎస్‌పీడీసీఎల్ విద్యుత్ వివాదానికి శుభం కార్డు



హైదరాబాద్, జూన్ 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ఎస్‌పీడీసీఎల్)తో నడుస్తున్న విద్యుత్ వివాదానికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు, కార్యదర్శి దేవ్‌రాజ్ నేతృత్వంలో కార్యవర్గం శాశ్వత ముగింపు పలికింది. 2015 నుంచి ఉన్న ఈ విద్యుత్ జగడానికి తమ కార్యవర్గం శుభం కార్డు వేసిందని జగన్‌మోహన్ రావు వెల్లడించారు. సుమారు రూ.1.64 లక్షల విద్యుత్ బిల్లు బకాయిగా ఉండగా, ఐపీఎల్ సమయంలో తొలుత రూ.15 లక్షలు చెల్లించామని చెప్పారు. మిగిలిన మొత్తం 4–5 వాయిదాల్లో చెల్లిద్దామని ఆలోచన చేసినా హెచ్‌సీఏ పేరు ప్రతిష్ఠలను దృష్టిలో పెట్టుకుని ఒకేసారి అంతా చెల్లించారు. మంగళవారం (టీఎస్ఎస్‌పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీకి రూ.1 కోటి 48 లక్షల 94 వేల 521ల మొత్తాన్ని చెక్ రూపంలో అందించినట్టు చెప్పారు.

**అధికారులపై చర్యలు తీసుకోవాలి.**

ఐపీఎల్ సందర్భంగా విద్యుత్ బిల్లు పెండింగ్‌లో ఉందనే కారణంతో క్రికెటర్లు ప్రాక్టీసు చేస్తుండగా కరెంట్ కట్ చేసి, హైదరాబాద్, తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఎండీ ఫరూఖీని జగన్‌మోహన్‌రావు కోరారు. పదేండ్ల క్రితం ఈ సమస్యకు తమను బాధ్యులను చేస్తూ ఐపీఎల్ సమయంలో కొందరు అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడంతో క్రికెటర్లు ఇబ్బంది పడడంతో పాటు జాతీయ స్థాయిలో ఈ విషయం సంచలనమైందని, ఇందుకు బాద్యులైన వారిపై విచారణ జరిపి, శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని జగన్‌మోహన్ రావు విజ్ఞప్తి చేశారు.

## రేవంత్ రెడ్డి పాలన పడకేసింది అనుకున్నాం.. కానీ అటకెక్కింది

**మొదటి పేజీ తరువాయి**

అంగన్ వాడీలు, గురుకుల టీచర్లు, ఆందోళన చేస్తుంటే పట్టింపు లేదు. రాష్ట్రంలో హత్యలు, హత్యాచారాలు జరుగుతుంటే పట్టించుకోవడం లేదన్నారు రాకేష్ రెడ్డి. జీవో 46 బాధితులను పట్టించుకోవడం లేదని, 60 మార్కులు వచ్చిన వారికి ఉద్యోగం వస్తె 90 మార్కులు వచ్చిన వారికి ఉద్యోగం రాలేదని ఆయన విమర్శించారు. వారికి న్యాయం చేస్తామని మాటిచ్చారు. కాంగ్రెస్ కోసం పనిచేయాలని అన్నారని, ఇప్పుడు ఎన్నికలు ఐపోగానే మొహం చాటేశారని రాకేష్ రెడ్డి మండిపడ్డారు. అంతేకాకుండా ఇప్పుడు జీవో 46 బాధితులు కాళ్ళు అరిగేలా తిరుగుతున్నారు. ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ పార్టీ కేటీఆర్, హరీష్ రావుని కలిశారు. వారి పక్షాన మేము సిఎస్ ను కలవడానికి వచ్చాం. 10 రోజులుగా చూస్తున్నాం. అపాయింట్మెంట్ ఇవ్వడం లేదు. ఈ ప్రభుత్వానికి చెప్పిన గోడకు చెప్పిన ఒక్కటే అని వినతి పత్రం సెక్రటేరియట్ గోడకు అంటించి వచ్చాం జీవో 46 బాధితుల పక్షాన నిలుస్తున్నం. వారికి న్యాయం జరిగే వరకు మేము కొట్లాడుతాం. నేను ఎమ్మెల్సీగా ఓడిపోవచ్చు ప్రజా క్షేత్రంలో ఉంటాం, చట్ట సభల్లో లెను జన సభల్లో ఉంటా, బాధితులు పక్షాన నిలబడతా బీఆర్ఎస్ పార్టీ బాధితులకు అన్ని విధాల అండగా ఉంటుంది. ప్రభుత్వాలు ఉద్యమాల వల్ల చట్టాలనే వెనక్కు తీసుకున్న సందర్బాలు ఉన్నాయి%ొ%ప్రజా పాలన అని చెబుతున్న రేవంత్ ప్రభుత్వం జీవో46 వెనక్కి తీసుకోవాలి లేదా సవరణ చేయాలి. అని రాకేష్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# తెలంగాణలో టీడీపీ అధికారంలోకి వస్తుంది

తెలంగాణ బ్యూరో, జూన్ 18 తీన్మార్ న్యూస్): ఏపీలో కూటమి విజయాన్ని ఉదాహరణగా తీసుకుని తెలంగాణలో కూడా అధికారంలోకి వస్తామని ధీమాను వ్యక్తం చేశారు నారా భువనేశ్వరి. తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు కృషిచేస్తామన్నారు ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి. రానున్న రోజుల్లో ఏపీలో వచ్చిన మెజార్టీలాగానే తెలంగాణలోనూ తెలుగుదేశం అధికారంలోకి రాబోతుందని కార్యకర్తలకు ధైర్యాన్నిచ్చారు. ఈ సందర్భంగా ఆమె ట్విట్టర్ వేదికగా ఒక ట్వీట్ చేశారు. నాడు నిజం గెలవాలి కార్యక్రమంలో ప్రజల ఆవేదన చూశానన్నారు. వారి బాధలు విన్నాను, ఇబ్బందులు తెలుసుకున్నానని ప్రస్తావించారు. అణచివేతను అర్థం చేసుకుని ముందుకు వెళ్లామని తాను కోరుకున్నట్లుగానే అద్భుతమైన ప్రజాతీర్పుతో ప్రజా పాలన మొదలైందని సందేశాన్ని ఇచ్చారు. ఈ రోజు రాష్ట్రంలో ఎక్కడ చూసినా ప్రజలు తామే గెలిచామన్నంత సంతోషంలో ఉన్నారన్నారు. స్వేచ్ఛగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. తమ అభిప్రాయాలు చెప్పగలుగుతున్నారన్నారు. అలాగే మరికొన్ని అంశాలను ప్రస్తావించారు. నాడు అశాంతితో బతికిన ప్రజల మనసులు నేడు తేలిక పడ్డాయని, మహిళలు తమ రక్షణపై, తల్లులు తమ బిడ్డల భవిష్యత్తుపై ధైర్యంగా ఉన్నారని ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. రాష్ట్ర ప్రజల ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయని అది తన మనసుకు ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఇకపై ప్రజలకు అంతా మంచే జరుగుతుందన్న భరోసాను కల్పించారు. కూటమి ప్రభుత్వంలోని సీఎం చంద్రబాబు పాలనతో అమరావతి రాజధానిగా మళ్లీ గర్వంగా నిలబడుతుందని ప్రస్తావించారు. రాజధాని రైతుల పోరాటాలు ఫలించి వారి జీవితాల్లో చీకట్లు తొలగిపోయాయని చెప్పారు. జూన్ 18న ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ కు హాజరయ్యారు నారా భువనేశ్వరి. ఆమెను పలువురు తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకులు కలిశారు. గత రెండు నెలలుగా పాదయాత్ర చేపట్టిన టిటిడిపి రాష్ట్ర కార్యదర్శి జెలమోని రవీందర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నాయకులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట వరకు 70 కిలోమీటర్ల పాదయాత్ర చేసినట్లు చెప్పారు. టీడీపీ గురించి ప్రజలకు వివరించినట్లు తెలిపారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ బలోపేతం చేసేందుకు మొత్తం 17 మంది నల్గొండ జిల్లాలో పాదయాత్ర చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో కూడా తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవాన్ని చూస్తామని ధీమాను వ్యక్తం చేశారు.

# మంగపేటకు బస్సు సర్వీసును ప్రారంభించిన మంత్రి సీతక్క

## ఏటూరునాగారంలో బస్ డిపో ఏర్పాటు అధికారులకు ఆదేశాలు

ములుగు, జూన్ 18 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా పర్యటనలో భాగంగా ఏటూరునాగారం నుంచి మంగపేట మండలం నరసింహాసాగర్‌కు వెళ్లే బస్సు సర్వీసును మంత్రి సీతక్క మంగళవారం ప్రారంభించారు. ఈ మేరకు ఆమె కలెక్టర్‌తో కలిసి ఆ బస్సులో టికెట్ తీసుకుని ఉచితంగా ప్రయాణించారు. ఆమె పర్యటన సందర్భంగా ఏటూరునాగారంలో బస్ డిపో ఏర్పాటు, ములుగు బస్ స్టాండ్‌ను మోడల్ బస్ స్టాండ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించాలని ఆమె అధికారులను ఆదేశించారు. త్వరలోనే ఆ రెండు పనులకు మంత్రి సీతక్క శ్రీకారం చుట్టనున్నారు.



# సచివాలయం వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం

## డిజైన్ల ఖరారు తర్వాత హెచ్‌ఎండీఏ టెండర్లు

హైదరాబాద్, జూన్ 18 (తీన్మార్ న్యూస్): సచివాలయం ఎదుట మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. లుంబినీ పార్కు, తెలంగాణ అమరవీరుల స్మారకం ముందు ఉన్న ఖాళీ స్థలాన్ని అందంగా పచ్చదనంతో ఉండేలా డిజైన్ చేసి పనులు చేపట్టాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ)కి ప్రభుత్వం సూచించింది. కొత్త సచివాలయం నిర్మాణం తర్వాత తెలుగుతల్లి విగ్రహం కూడలిని పూర్తిగా తొలగించి సరికొత్తగా తీర్చిదిద్దుతున్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుతోపాటు దాని చుట్టు పక్కల అభివృద్ధికి సుమారు రూ.1.74 కోట్ల వ్యయం అంచనా వేశారు. హుస్సేన్‌సాగర్ తీరంలో ఉన్న ఈ ప్రాంతాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, ట్రాఫిక్ చిక్కులు లేకుండా పార్కింగ్ స్థలాలు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ల్యాండ్ స్కేపింగ్ చేస్తున్నట్టు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో నిర్మించిన నూతన సచివాలయాన్ని చూసేందుకు నగరవాసులతోపాటు వివిధ ప్రాంతాలను నిత్యం ప్రజలు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ కూడలిని ప్రత్యేకంగా డిజైన్ చేసి నిర్మిస్తున్నామని, ఇప్పటికే ఆర్కిటెక్టులతో కలిసి హార్టికల్చర్ విభాగం అధికారులు చర్చలు జరిపారని తెలిపారు. దీనికి డిజైన్లు ఖరారు చేసిన తర్వాత టెండర్లు పిలిచి పనులు చేపడతామని హెచ్‌ఎండీఏ అధికారులు పేర్కొన్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# ప్రాంతీయ పార్టీల బలం పెరిగిందా.. తగ్గిందా...

చెట్టు..ముందా... విత్తు ముందా అన్నట్టు తయారైంది. పదేళ్ల నుంచి ఒకే పార్టీకి పట్టం కట్టిన ఓటరు... ఈ సారి కొన్ని ప్రాంతీయ పార్టీలకు లైఫ్ ఇచ్చినట్టయింది... 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో అప్రతిహతంగా అత్యధిక స్థానాలను సాధించుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగిన బిజెపి, ఈసారి తగిన స్థానాలను దక్కించుకోవడంలో వెనుకబడడమే గాక, విపక్షాల నుంచి గట్టి పోటీని ఎదుర్కోవలసి వచ్చింది. అందుకే పొత్తు కుదుర్చుకునే అవసరం ఇప్పటివరకు రాకపోయినప్పటికీ, తెలుగుదేశం, జనతాదళ్ యునైటెడ్ పొత్తుతో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. దీంతో తెలుగుదేశం, జెడి(యు) పార్టీలకు ఎన్‌డిఎ ప్రభుత్వంలో భాగస్వామ్యం పొందే అవకాశం లభించింది. ఈ అవకాశం అన్నిప్రాంతీయ పార్టీలకు లభించలేదు. సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్య పరిణామాలు తలెత్తడంతో ప్రస్తుతం బిజూ జనతా దళ్, బహుజన సమాజ్, జననాయక్ జనతా, టిఆర్ఎస్, అన్నాడిఎంకె ఈ ఐదు ప్రాంతీయ పార్టీల ఉనికి దెబ్బతింది.అస్తిత్వ సంక్షోభం దిశగా చూడవలసి వస్తోంది. పార్లమెంట్‌లో తమ గొంతు వినిపించే అవకాశాన్ని కోల్పోయాయి. ఈ పార్టీలన్నీ ఒకప్పుడు ముఖ్యమంత్రులను, ఒకానొక సందర్భంలో పార్లమెంట్‌కు విశేష సంఖ్యలో ఎంపిలను పంపించినవే. ఈసారి మాత్రం అస్తిత్వ సంక్షోభాన్ని అనుభవిస్తున్నాయి. 1997 లో బిజూ జనతాదళ్ ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఎలాంటి ఎదురీత లేని పార్టీ ఇప్పుడు పార్లమెంట్‌లో తన ప్రాతినిధ్యం అన్నది లేకుండా పోయింది. మొట్టమొదటిసారి 2009 తరువాత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్టీ మెజార్టీ సాధించుకోలేకపోయింది. గత 24 ఏళ్లుగా తిరుగులేని ముఖ్యమంత్రిగా నెగ్గుకుంటూ వస్తున్న నవీన్ పట్నాయక్ ఇప్పుడు పక్కకు తప్పుకోవలసి వచ్చింది. బిజెపి నుంచే ముఖ్యమంత్రి అవుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బిజూ జనతాదళ్ ఓట్ షేర్ 2019లో 43.32 శాతం ఉండగా, ఇప్పుడు 37.53 శాతానికి దిగజారిపోవడం శోచనీయం. 21 పార్లమెంట్ స్థానాలకు 2019 లో 12 సాధించుకోగా, ఈసారి జీరో అయింది. అసెంబ్లీ ఎన్నికలను పరిశీలిస్తే మొత్తం 147 స్థానాలకు కేవలం 51 స్థానాలనే గెలుచుకోవడం గమనార్హం. 5% పాయింట్లు దిగజారి 40.22% ఓట్లు మాత్రమే వచ్చాయి. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లోనూ చాలా అధ్వాన పరిస్థితి దాపురించింది. ప్రాంతీయ పార్టీల్లో ఒకప్పుడు మిగతా పార్టీలన్నిటినీ తుడిచిపెట్టేసిన బిజూ జనతాదళ్ పార్టీ ఇప్పుడు ఈ ఏడాది ఒక్క సీటు కూడా సాధించలేని స్థితికి దిగజారిపోయింది. పొరుగునున్న ఉత్తరప్రదేశ్‌లో మాయావతికి చెందిన బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి)ది కూడా ఇదే పరిస్థితి. ఒకప్పుడు దళితుల గొంతుగా గుర్తింపు పొందిన ఈ పార్టీ ఉత్తరప్రదేశ్‌లో తన పట్టును కోల్పోయినట్టు కనిపిస్తోంది. ఈసారి ఎన్నికల్లో ఖాతా తెరవలేక 10% పాయింట్ల ఓట్ల భాగస్వామ్యాన్ని 9.39 శాతం వరకు కోల్పోయింది. 2019లో ఈ పార్టీ 19.42% ఓట్ షేర్‌తో 10 పార్లమెంట్ స్థానాలను సాధించుకోగా, ఈసారి పోలింగ్‌కు ముందే ఎస్‌పితో పొత్తు విషయంలో వివాదానికి దిగిందహర్యానాలో ఉత్తర ఎగువ నియోజక వర్గంలో జననాయక్ జనతా పార్టీ కూడా రాష్ట్రంలోని తనకున్న పది స్థానాలను కోల్పోయింది. మాజీ ఉప ప్రధాని దేవీలాల్ భావజాలంతో 2018లో ఈ పార్టీ ఏర్పాటైంది. 2019 లో హర్యానా శాసన సభ ఎన్నికల్లో 10 స్థానాలను గెలుచుకోగా, ఈ ఏడాది మార్చి వరకు రాష్ట్రాన్ని పాలించిన బిజెపి నేతృత్వం లోని సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండేది. 2019 ఎన్నికల్లోనూ ఇప్పుడు కూడా కనీసం ఒక్క ఎంపి సీటు కూడా గెలుచుకోలేకపోయింది. చాలా స్థానాల్లో అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. ఈ పార్టీ ఓట్ల శాతం వాటా 4.9% నుంచి 0.87 శాతానికి పడిపోయింది. తెలంగాణలో తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ఎస్) కూడా పార్లమెంట్ స్థానాలను గెలుచుకోలేక పోయింది. 2014లో 11 ఎంపి స్థానాలను గెలుచుకున్న ఈ పార్టీ 2019లో 9 స్థానాలనే గెలుచుకోగా, 2024లో జీరో స్థానాలయ్యాయి. ఇంకా దక్షిణాదిలో తమిళనాడుకు సంబంధించి ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (ఎఐఎడిఎంకె)ను మొదట అగ్రనటుడు, అగ్ర రాజకీయ యోధుడు ఎంజిఆర్ స్థాపించగా, తరువాత నటి జయలలిత సారథ్యం వహించారు. మొట్టమొదటిసారి ఎన్నికల్లో ఎన్‌డిఎతో పొత్తులేకుండా పోరు సాగించిన ఈ పార్టీ ఇప్పుడు తమిళనాడులో తాను పోటీకి నిలబడిన మొత్తం 32 స్థానాలను కోల్పోయింది. ఎఐఎడిఎంకె మిత్ర పక్షాలైన దేశీయ ముర్పొక్కు ద్రవిడ కజగం (డిఎండికె), సోషల్ డెమొక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డిపిఐ), పుదియ తమిజగమ్ (పిటి) పార్టీలు కూడా రాష్ట్రంలోని మిగిలిన 7 ఎంపి స్థానాల్లో ఏ ఒక్కటీ దక్కించుకోలేకపోయాయి. 2014లో ఎఐఎడిఎంకె మొత్తం 39 ఎంపి స్థానాల్లో 37 వరకు గుండుగుత్తగా దక్కించుకోగా, 2019 ఎన్నికల్లో పార్టీ స్థాయి బాగా కుదించుకుపోయి ఒకే ఒక్క స్థానానికి పరిమితమైంది. ఇప్పటి ఎన్నికల్లో ఆ ఒక్కటి కూడా మిగల లేదు.

# పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

**– అందజేసిన కావలి గోవింద నాయుడు. (న్యాయవాది)**





పెబ్బేరు, జూన్18(తీన్మార్ న్యూస్): శాగాపూర్. వై గ్రామంలో హై స్కూల్ లో పదవ తరగతి లో2023-24 లో గాను ఉత్తమ గ్రేడ్ సాధించిన 9. మంది పేద విద్యార్థులకు గాను ఒక్కొక్కరికి చొప్పున. రూ.5000/- రూపాయలు 9మంది విద్యార్థులకు గోవింద నాయుడు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు చదువు విషయంలో ఎల్లప్పుడు తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, సాహ ఉపాధ్యాయులు విజయ్ కుమార్, పద్మావతి కుర్మయ్య, నందకిషోర్, వినోద్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అలివేలమ్మ, పాల్గొన్నారు. మొదటిది ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ప్రతిభ, రఫీక్ పల్లవి, శైలజ, వైజయంతి, అఖిల, విజయ్, శశి కుమార్, ఈశ్వర్ ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోట్ల బాలచందర్ రెడ్డి, సింగల్ విండో వైస్ చైర్మన్, జక్కుల ఆంజనేయులు, రామకృష్ణ, సహదేవుడు, కేశవులు, లక్ష్మణ్, రాఘవేందర్, అంజి, వల్లమని బలరాం, మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు, గోవిందు నాయుడు( న్యాయవాది) సన్మానించారు.

# నీట్ పేపర్ లీకేజీ పై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి

**– విద్యార్థుల భవిష్యత్ కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు**
**– నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం**
**– తక్షణమే నీట్ పరీక్ష రద్దు చేయాలి**
**– ఎన్ఎస్ యుఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళన**





మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి, జూన్18(తీన్మార్ న్యూస్): నీట్ పేపర్ లీకేజీ పై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ విద్యార్థి సంఘము ఎన్ఎస్ యుఐ నాయకులు డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా, దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ విద్యార్థి సంఘము ఎన్ఎస్ యుఐ ఆధ్వర్యంలో నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ కు నిరసనగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ యుఐ నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విద్యార్థుల భవిష్యత్ కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. నీట్ పరీక్షలపై ప్రధాన మంత్రి, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వెంటనే నీట్ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లీకేజీ తో సంబంధం ఉన్న దోషులను శిక్షించాలని కోరారు. నరేంద్ర మోడీ మౌనం విడాలని కోరారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ యుఐ స్టేట్ జనరల్ సెక్రెటరీ లు ఎం.డి. అక్బర్, కృష్ణవర్ధన్ రెడ్డి, కొత్తకోట మున్సిపాలిటీ టౌన్ అధ్యక్షులు శ్యామ్, కొత్తకోట మండల అధ్యక్షులు దిలీప్ రెడ్డి, అసెంబ్లీ జనరల్ సెక్రటరీలు రాఘవరెడ్డి, రమేష్, మండల ఉపాధ్యక్షులు రమేష్ మరియు పలువురు విద్యార్థి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నంలో ఆధార్ సెంటర్ బంద్

**– ఇబ్బందులు పడుతున్న ఇబ్రహీంపట్నం ప్రజలు**
**– ఆధార్ గురించి హైదరాబాద్ కు వెళ్తున్న ప్రజలు**
**– సమస్యను వెంటనే పరిష్కరించాలి**
**– ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ బి ఆర్ ఎస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొర్ర రమేష్**



ఇబ్రహీంపట్నం, జూన్ 18(తీన్మార్ న్యూస్): ఇబ్రహీంపట్నంలో ఆధార్ సెంటర్ బంద్ ఉండటం తో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ బిఆర్ఎస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొర్ర రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలో గల ఆధార్ సెంటర్ గత కొన్ని రోజుల నుంచి బంద్ ఉన్నది.ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో గల ప్రజలు,ముఖ్యంగా విద్యార్థులు ఆధార్ అప్డేషన్ గూర్చి,నేమ్స్ కరెక్షన్ గూర్చి ఇబ్బంది పడుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి ఇబ్రహీంపట్నంలో గల ఆధార్ సెంటర్ బంధు ఉండడంతో ఇబ్రహీంపట్నంలోని ప్రజలు విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ బిఆర్ఎస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొర్ర రమేష్ (టిల్లు) ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 12 తారీకు పాఠశాలలు, కళాశాలలు పునః ప్రారంభం అయినాయి. పాఠశాలకు వెళ్లే,కళాశాలకు వెళ్లే విద్యార్థి విద్యార్థులకు,కులం సర్టిఫికెట్, ఆదాయం సర్టిఫికెట్ అదేవిధంగా ఆధార్ అప్డేషన్ సంబంధించిన డాక్యుమెంటేషన్ విద్యాశాఖ వారు అడుగుతున్న సందర్భంలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలో ఆధార్ సెంటర్ బంద్ కావడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. అదేవిధంగా ఇబ్రహీంపట్నం ప్రజలు తమ పనులను వదిలేసి, హైదరాబాద్ వెళ్లి ఆధార్ సెంటర్లో గంటల తరబడి క్యూలో నిలబడి ఉన్నప్పటికీ కూడా ఒక రోజులో పని కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అని ఆయన అన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ఆదార్ సెంటర్ ను ఓపెన్ చేయించి విద్యార్థులకు, ప్రజలకు న్యాయం చేయాలని ఆయన అన్నారు. లేని యెడల బిఆర్ఎస్ పార్టీ తరఫున పెద్ద ఎత్తున ధర్నా చేసి విద్యార్థులకు, ప్రజలకు అండగా నిలుస్తామని బొర్రా రమేష్ (టిల్లు )అన్నారు.

# సత్యనారాయణ మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటు

**– తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మండవ వెంకటేశ్వర్లు గౌడ్**



గరిడేపల్లి, జూన్ 18(తీన్మార్ న్యూస్): పోనుగోడు మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బిల్లా సత్యనారాయణ మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని తెలుగుదేశం పార్టీ హుజూర్ నగర్ నియోజకవర్గ ఇన్చార్జ్, నల్గొండ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు గౌడ్ అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన బిల్లా సత్యనారాయణ భౌతికాయంపై మంగళవారం తెలుగుదేశం పార్టీ పతాకాన్ని కప్పి , పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. సర్పంచ్ గా తన హయాంలో పొనుగోడు గ్రామ అభివృద్ధికి పాటుపడడంతో పాటుగా తెలుగుదేశం పార్టీకి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. సత్యనారాయణ ఆశయ సాధన కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రజా నాయకులు సుందరి జగన్, తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు కీసరి నాగయ్య, బిల్లా వెంకటేశ్వర్లు, తెలుగుదేశం గ్రామ శాఖ అధ్యక్షులు జుట్టుకొండ సోమయ్య, తెలుగుదేశం మండల అధికార ప్రతినిధి బాల్తు భాస్కర్, తెలుగు యువత నాయకులు మాచర్ల రవి, కీసరి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి భక్తుల అన్నదానం కోసం విరాళం అందజేత



యాదగిరిగుట్ట, జూన్ 18(తీన్మార్ న్యూస్): యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దర్శనం కోసం విచ్చేసే భక్తులకు అన్నదానం కోసం హైదరాబాద్ కు చెందిన అజయ శ్రీ హెూమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు నిమ్మగడ్డ రామకృష్ణారావు జ్యోతి దంపతులు మంగళవారం 18 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. శ్రీ స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా గిరిప్రదక్షిణ అనంతరం ఆలయ ఈవో భాస్కరరావు ప్రధానార్చకులు నల్లన్తీగల్ లక్ష్మీ నరసింహ చార్యులులకు చెక్కును అందజేయగా వారు కృతజ్ఞతలు చెప్పారు.

# కలెక్టర్, ఎస్పీ లకు వినతి పత్రం అందజేసిన ధర్మ సమాజ్ కార్యకర్తలు





నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూన్ 18(తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్, ఎస్పీని కలిసిన ధర్మ సమాజ పార్టీ నాయకులు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నారాయణపేట జిల్లా, ఊట్కూర్ మండలం చిన్న పొర్ల గ్రామ భూవివాదం లో హత్య చేయబడ్డ సంజీవ్ కుమార్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీని కలిసిన ధర్మ సమాజ్ పార్టీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ నాయకులు దశరథ్ కుమార్ అడ్వకేట్ మాట్లాడుతూ హత్య చేయబడ్డ సంజీవ్ కుమార్ కు భార్య అనిత తో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు అని వారి యొక్క జీవనోపాధి కష్టంగా మారిందని, అందుకనే రాష్ట్ర ప్రభుత్వం 20 లక్షల ఎక్స్‌గ్రేషియో ఆ కుటుంబానికి ప్రకటించి మరియు ఆ కుటుంబంలో భార్యకు ఉపాధి కల్పించాలని అలాగే తక్షణం ఒక కమిటీ వేసి హత్య కు ప్రేరేపించిన అంశాలను క్లుప్తంగా ఇన్వెస్టిగేషన్ చేసి వారి పైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు డేవిడ్, గోపాలకృష్ణ, వేణు, గువ్వల శివరాజ్, కర్నే బాలరాజ్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరా ల ఏర్పాటుకు నూతి సైదులు ముదిరాజ్ కృషి

**– దొంగతనాలు హరికట్టడమే లక్ష్యం**
**– సీసీ కెమెరాలు ఏర్పాటు**



చిట్యాల, జూన్ 18(తీన్మార్ న్యూస్): చిట్యాల మున్సిపాలిటీలో 1వ వార్డు శివనేనిగూడెం లో సీసీ కెమెరాల ఏర్పాటు కు ఎమ్మెల్యే వేముల వీరేశం అభిమాని నూతి సైదులు ముదిరాజ్ కృషి చేశారు. చుట్టూ ప్రక్కల గ్రామాలు, ప్రాంతాలలో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తూ, అనుమానితులు గా గుర్తించడంతో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున, పరిణామాలు దృష్టిలో పెట్టుకొని సీసీ కెమెరాలు కావాలని కోరగా వెంటనే సైదులు స్పందించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ప్రజా సేవలో ముందుకు వచ్చి తన వంతుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన నూతి సైదులు కి వార్డు ప్రజలు, నాయకులు, తదితరులు అభినందనలు తెలియజేశారు.

# ఈ నెల 26న లోక్ సభ స్పీకర్ ఎన్నిక..?

ఈనెల 24 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నట్టు తెలుస్తోంది. అయితే మొత్తం దాదాపు 10 రోజుల పాటు సాగే ఈ సెషన్ లో తొలి రెండు రోజులు కొత్తగా ఎన్నికైన ఎంపీలు ప్రమాణ స్వీకారోత్సవం చేస్తారు. అలాగే ఈనెల 26న లోక్ సభ స్పీకర్ ఎన్నిక జరుగనున్నట్టు సమాచారం. ఎన్డీఏ కూటమిలో కీలకంగా మారిన టీడీపీ-జేడీయూ స్పీకర్ పదవీ కోసం పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. మొత్తం 10 రోజుల పాటు సాగే ఈ సమావేశాల్లో ఎన్డీయే ప్రభుత్వం ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటుందోననే చర్యలు సాగుతుండగా.. ప్రతిపక్షాలు మాత్రం నీట్ లీకేజీపై ప్రభుత్వాన్ని నిలదీయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం.

# పాలకీడు మండలంలో దారుణ హత్య

**– కుటుంబ కలహాలతో భర్తను చంపిన భార్య, తరపు బంధువులు**





పాలకీడు, జూన్ 18(తీన్మార్ న్యూస్): కుటుంబ కలహాలతో భార్య, తరపు బంధువులు భర్తను హత్య చేసిన సంఘటన పాలకీడు మండలం గుడుగుంట్ల పాలెం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 2009 సంవత్సరములో మూసిఒడ్డు సింగారం గ్రామానికి చెందిన ఆరుట్ల చిరంజీవి తండ్రి సోమయ్య, వయస్సు 41 సంవత్సరాలు గుడుగుంట్ల పాలెం గ్రామానికి చెందిన రాయి అరుణ ను వివాహం చేసుకున్నాడని గత లాక్ డౌన్ నుండి చిరంజీవి ఏ పని కి వెళ్లకపోవడం తో అరుణ ప్రయివేట్ స్కూల్ లో పనిచేస్తుండటము తో అనుమానం తో వేధిస్తూ స్కూల్ మాన్పించిగా పెద్దల సమక్షంలో రాజీ పడినారని . సోమవారం అరుణ వద్దకు తన అత్తవారింటి కి గుడుగుంట్లపాలెం కు వెళ్ళగా అక్కడ అరుణ తన తరుపు బందువులు చిరంజీవి తో గొడవ పడి తాళ్ళతో కట్టివేసి కర్రలు, రాళ్ళు మరియు చేతులతో విచక్షణ రహితంగా కొట్టడముతో కుడి కాలు విరిగి, ఎడమ కాలు మరియు ఇతర శరీర భాగాలకు రక్త గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడని మృతుడు రెండో అన్న ఆరుట్ల నరేందర్ ఇచ్చిన ధరకాస్తు పై కేసు నమోదు చేసి సర్కిల్ ఇన్స్ పెక్టర్ చరమంద రాజు విచారణ చేపట్టారని తెలిపారు.

# నీట్ అవకతవకలపై సుప్రీం ప్రత్యేక బృందం దర్యాప్తు చేయాలి



నేరేడుచర్ల, జూన్ 18(తీన్మార్ న్యూస్): నీట్ లో జరిగిన అవకతవహాల వ్యవహారం పై సుప్రీంకోర్టు ఏర్పాటు చేసి బృందంతో ప్రత్యేక దర్యాప్తు జరిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నాడు ఆయన నేరేడుచర్లలోని సిపిఐ కార్యాలయం ప్రజా భవన్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఏఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐఎస్ఎఫ్ నాయకుడు కొమర్రాజు వెంకట్ తో కలిసి మాట్లాడుతూ నీట్ పరీక్షను సమర్ధవంతంగా నిర్వహించేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాలలోని అఖిలపక్ష బృందాలతో సమావేశాలు నిర్వహించి జాతీయస్థాయిలో విద్యార్థి సంఘాల సూచనలు సలహా మేరకు పరీక్ష నిర్వహించాలని, నీట్ పరీక్షలు మళ్ళీ నిర్వహించాలని, నీట్ లీకేజీ పై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గతంలో అధికారులు ఉన్న యూపీఏ ప్రభుత్వం పై ఈ నిందలు మోపేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని, కానీ యూపీఏ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని ఇది ఏ ఒక్క రాష్ట్రానికో పరిమితం కాలేదని దేశవ్యాప్తంగా ఈ పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నాయని, సిబిఐతో దర్యాప్తు జరిపితే అధికారులు కాపాడే అవకాశాలు ఉన్నాయని అందుకే సుప్రీంకోర్టు ఏర్పాటు చేసే స్వతంత్ర దర్యాప్తు బృందం లేదా ప్రభుత్వంతో సంబంధం లేని నిపుణులతో దర్యాప్తు జరిపించాలని ఆయన కోరారు.

పేపర్ లీకేజీ పై నరేంద్ర మోడీ బాధ్యత వహించి దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎన్టీఏ ను రద్దు చేయాలని నీట్ పరీక్షల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని భాదిత విద్యార్థులకు సత్వరమే న్యాయం చేయాలని ఆయన కోరారు.

# రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలి

**– ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొంతగోని శివ కృష్ణ**



ఇబ్రహీంపట్నం, జూన్ 18(తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొంతగోని శివ కృష్ణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థలు ప్రారంభమైనప్పటికిన విద్యాశాఖ కు మంత్రిని నియమించకపోవడం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన చేతగానితనం అని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖకు మంత్రిని నియమించాలని కోరారు. ఎన్నికల్లో కల్లబొల్లి కబుర్లు, మోసపూరితమైన వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థులకు దిశా నిర్దేశం చేయాల్సిన ఆ శాఖకు మంత్రి లేకపోవడం వల్ల సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని వెల్లడించారు. రానున్న రోజుల్లో అన్ని పరీక్షలు నిర్వహించడంతో పాటు పలు రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాల్సి ఉంది అన్నారు. ఇందుకు అనుగుణంగా విద్యాశాఖకు తక్షణమే మంత్రిని నియమించి ఆ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

# జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలి

**– డీఈవో గోవిందరాజులకు వినతి పత్రం అందజేసిన టియుడబ్ల్యుజే ఐజేయు జర్నలిస్టులు**



వనపర్తి ప్రతినిధి, జూన్ 18(తీన్మార్ న్యూస్): ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించే విధంగా కృషి చేయాలని టియుడబ్ల్యుజే ఐజేయు వనపర్తి పట్టణ శాఖ ఆధ్వర్యంలో జర్నలిస్టులు డీఈవో కార్యాలయంలో మంగళవారం డిఇఓ గోవిందరాజులు కు వినతిపత్రం అందజేశారు. గతేడాది మాదిరిగా 2024 -25 విద్యాసంవత్సరా నికి గాను ప్రతి ప్రైవేటు పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందే విధంగా చూడాలనీ, ప్రతి పాఠశాలకు ఉచిత విద్యపై సర్కులర్ జారీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన డీఈవో గోవిందరాజులు రెండు లేదా మూడు రోజుల్లో ప్రతి జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య అందే విధంగా సర్కులర్ జారీ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు, టీయూడబ్ల్యూజే ఐజేయు మాజీ నేషనల్ కౌన్సిలర్ సభ్యులు మల్యాల బాలస్వామి, వనపర్తి జిల్లా ఎడ్యుకేషన్ కన్వీనర్ కుమార్, సీల్ మూర్తి, ఆంజనేయులు, తిరుపతయ్య, ముంత రవి యాదవ్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట గిరిప్రదక్షిణ చేయడం నా జన్మ ధన్యమైంది

**– ఎమ్మెల్యే విప్ బీర్ల ఐలయ్య**





యాదగిరిగుట్ట, జూన్ 18(తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మంగళవారం స్వాతి నక్షత్రం సందర్భంగా సుమారు 10 వేల మందితో సామూహిక గిరిప్రదక్షిణ లో పాల్గొన్నారు. గిరిప్రదక్షిణలో తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి ఆలేరు నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. జై బోలో లక్ష్మీ నరసింహస్వామి అంటూ, భజనలు చేస్తూ, యధా ఋషి వద్ద నమస్క రించి గిరి ప్రదక్షిణ ముందుకు సాగింది. విగ్రహం వద్ద నమస్కరించి ఈ గిరిప్రదక్షిణ కొనసాగించారు. గిరి ప్రదక్షిణ అనంతరం మెట్ల మార్గంలో కొండపైకి చేరుకుని సర్వదర్శనం క్యూలైన్లో ఆలయంలోకి వెళ్లి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారులు స్వామివారి లడ్డు ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యులు అందరికీ ఆదర్శంగా నిలవాలి

**– తెల్ల జవహర్ బాబు**

***– 1800 క్లబ్ లు.... లక్ష మంది సభ్యులతో వాసవి క్లబ్ సేవలు***



గరిడేపల్లి, జూన్ 18(తీన్మార్ న్యూస్): ఆర్యవైశ్యులు సమాజంలో అందరికీ ఆదర్శంగా నిలవాలని వాసవి క్లబ్ అంతర్జాతీయ అడిషనల్ ట్రెజరర్ జవహర్ బాబు పిలుపునిచ్చారు. గరిడేపల్లిలోని సాయిబాబా దేవాలయం ప్రాంగణంలో వాసవి, వనిత క్లబ్ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆది నుంచి ఆర్యవైశ్యులు సమాజ సేవలో ముందుంటారని తెలిపారు. ఆర్యవైశ్యులతో పాటు సమాజంలోని నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి అవసరమైన సేవలను ఉచితంగా అందించే లక్ష్యంతో వాసవి, వనిత క్లబ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

అంతర్జాతీయంగా 1800 క్లబ్లతో లక్షమంది సభ్యులతో వాసవి క్లబ్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సమాజసేవే లక్ష్యంగా అట్టడుగు వర్గాల అభ్యున్నతికి చేయూతనందించేందుకు వాసవి క్లబ్ శాఖలుగా విస్తరించి లక్షలాదిమంది సభ్యులతో ప్రతి ఏడాది వేల కోట్ల రూపాయలతో సేవా కార్యక్రమాలను అందిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో ఉత్తమ సేవలు అందించి రాష్ట్రపతి నుంచి ఉత్తమ సేవా వార్డును అందుకున్న ఘనత వాసవి క్లబ్ కి దక్కిందన్నారు. సమాజంలో ఆర్యవైశ్యులకే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో గ్రామాల్లో ఆర్యవైశ్యుల సంఖ్య బాగానే ఉండేదని ప్రస్తుతం గ్రామాల నుంచి అధికంగా వ్యాపారల అవసరాల కోసం పట్టణాలకు వలస వెళ్లడంతో గ్రామాల్లో ఆర్యవైశ్యుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందన్నారు. అయినప్పటికీ గ్రామాల్లో ఉన్న కొంతమంది ఆర్యవైశ్యులు సంఘటితంగా ముందుకు వచ్చి వాసవి క్లబ్ లో ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు అందించాలని ఆయన కోరారు. నైపుణ్యం గల విద్యార్థులు చదువు కోసం పాఠశాలలో తాగనీటి అవసరాలు, మహిళల స్వయం ఉపాధి కోసం, చిరు వ్యాపారుల కోసం నిధులు అందిస్తున్నా మని సమాజ కోసం అభివృద్ధి కోసం పాటుపడే సామాజిక రాజకీయ ఉపాధ్యాయ ఉద్యోగ వర్గాలలో ఉన్న వారిని గుర్తించి వారిని సంప్రదాయబద్ధమైన గౌరవాన్ని పెంపొందే విధంగా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సేవలు అందించేందుకు ముందుకు వచ్చిన వాసవి, వనిత క్లబ్ లకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని కోరారు మొదట గరిడేపల్లి మండలం వాసవి క్లబ్ వనిత క్లబ్ నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు వాసవి క్లబ్ అధ్యక్షులు గల్లీ సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఇల్లింద్ర సురేష్, కోశాధికారిగా ఈగ వెంకటేశ్వర్లు, వనిత క్లబ్ అధ్యక్షురాలుగా పోలిశెట్టి ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా ఇల్లిందల కల్పన, కోశాధికారిగా గిల్లి పుష్పలత, ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ గవర్నర్ రాచర్ల కమలాకర్, వైస్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, చైర్పర్సన్ వీరవిల్లి పద్మావతి, కొత్త లక్ష్మణ్, వీరవిల్లి శ్రీలత మండల ఆర్యవైశ్య నాయకులు పోలిశెట్టి అంజయ్య, తొడుపునూరు కృష్ణమూర్తి, పోలిశెట్టి పెద్దబాబు, శ్రీరంగం ప్రసాద్, రత్నాకర్ మాజీ వనిత క్లబ్ అధ్యక్షుడు శ్రీరంగం కవిత, బొడ్ల హనుమంతరావు, నరసింహరావు, కృష్ణమూర్తి తో పాటు వివిధ గ్రామాలకు చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రవేటు పాఠశాల లో పర్యవేక్షణ లోపం

**– కాంటెస్టేడ్ స్వతంత్ర ఎమ్మెల్యే దయానంద్ ముదిరాజ్**



వనపర్తి ప్రతినిధి, జూన్ 18(తీన్మార్ న్యూస్): వనపర్తి నియోజకవర్గ కాంటెస్టెడ్ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి దయానంద్ ముదిరాజ్ మాట్లాడుతూ వనపర్తి జిల్లా లో విద్యా వ్యవస్థ పై పర్యవేక్షణ లోపం కనబడుతున్న అధికారులు ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. ఈ నెల 12 వ తేదీన చాలా ఘనంగా పాఠశాలలు ప్రారంభమయినా వాటి ఫలితం నామమాత్రం గానే ఉందని ప్రభుత్వ అనుమతులకు వ్యతిరేఖం గా వ్యవహరిస్తున్న ప్రవేటు పాఠశాల పై చర్యలు చేపట్టాలని కోరారు. ప్రవేటు పాఠశాలలు సరైన సమయ పాలన పాటించాలని విద్యార్థుల మానసిక పరిస్థితులను పరిగణం లోకి తీసుకోవాలని కొన్ని పాఠశాలలు ఇష్టా రాజ్యం వ్యవహరించడం వల్ల ఉదయం విద్యార్థులు అల్పాహారం తినకుండా పాఠశాల కు చేరుకుంటున్నారు. సాయంత్రం ఆటలు మరియు సహపాఠ్య కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనే విధంగా విద్యార్థులను తీర్చి దిద్దాలి. కొన్ని ప్రభుత్వ పాఠశాల లు విద్యార్థులకు సమస్య లతో స్వాగతం పలుకుతున్నాయి. మన ఊరు -మన బడి, ఆదర్శ పాఠశాల పథకాలతో కొన్ని చోట్ల మేలైన ఇంకా చోట్ల సమస్యలే స్వాగతం పలుకుతున్నాయి.పాఠశాల లో బోధకులకొరత లో బోధన ముందుకు సాగడం లేదని తేలిపారు.

# ఎంపీపీ అధ్వర్యంలో మండల టాస్క్ ఫోర్స్ సమావేశం



రామన్నపేట, జూన్ 18(తీన్మార్ న్యూస్): రామన్నపేట ఎంపీపీ పూస బాలమని బాలనరసయ్య ఆధ్యరములో మండల టాస్కు ఫోర్స్ సమావేశము నిర్వహించారు. ఈ నెల 20న నిర్వహించే జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సము గురించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశములో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశ్విని కుమార్ (మండల వైద్య అధికారి) మాట్లాడుతూ 1- 19 సం"లోపు పిల్లలలో నులిపురుగుల నిర్మూలన కొరకు తేది 20-06-2024 న అన్ని అంగన్ వాడి కేంద్రలలో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల మరియు జూనియర్ కళాశాల లోని పిల్లలకు Albendzole మాత్రను భోజనము అనంతరము మింగి పించవలసిందిగా తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, ఎంపిడిఓ యాకూబ్ నాయక్, తహశీల్దార్ లాల్ బహదూర్, సిరిపురం ఎంపీటీసీ బడుగు రమేష్, ఎపివో వెంకన్న, సూపరిండెంట్ శ్రీనివాసరెడ్డి, హెచ్ఈవో గోపాల్, తదితరులు పాల్గొన్నారు.


# జాన్ పహాడ్ దర్గా వరకు ఆర్టీసీ బస్సు నడపాలి



**– గిరిజన శక్తి రాష్ట్ర కార్యదర్శి మధు నాయక్**

పాలకవీడు, జూన్ 18(తీన్మార్ న్యూస్): మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న జాన్ పాడ్ దర్గా వరకు ఆర్టీసీ బస్సును నడపాలని గిరిజన శక్తి స్టేట్ సెక్రటరీ కెలావత్ మధు నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం మిర్యాలగూడ డిపో మేనేజర్ బుల్లెద్దు పాల్ కు వినతి పత్రం అందజేశారు. మధు నాయక్ మాట్లాడుతూ ఆర్టీసీ వారు జాన్పాడు దర్గా వరకు ఆర్టీసీ బస్సును నడపకుండా జాన్పాడు గ్రామం వరకు ఆర్టీసీ బస్సు వస్తుందని ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని మహంకాళి గూడెం రావిపాడు దర్గా శూన్య పాడు కల్మెట్ తండ ప్రజలు బస్సు లేక ఇబ్బంది పడుతున్నారని వెనువెంటనే ఆర్టీసీ బస్సు దర్గా వరకు నడపాలని కోరానని, వారు స్పందించి దర్గా వరకు బస్సు నడుపుతామని హామీ ఇచ్చారని అన్నారు.

# సమ్మన్న మాదిగ జన్మదిన వేడుకలు





రాజాపేట, జూన్ 18(తీన్మార్ న్యూస్): రాజపేట మండలం ఎం.ఈ. ఎఫ్, నాయకులు పెద్దోళ్ళ సమ్మయ్య, 36వ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించి, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, ఎం ఈ ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులు ఇంజ మహేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు రామ్ గొల్ల శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్ఎఫ్, మండల నాయకులు, కోయ బాలరాజ్ మాదిగ, డప్పు చిన్న మాదిగ, వరిమడ్ల కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

# కారును కాపాడుకొనేది ఎలా

హైదరాబాద్: ఓడలు బండ్లు అవుతాయి.. బండు ఓడలు అవుతాయి అన్నది సమేత. ఈ సామెత తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ప్రస్తుతం సరిగ్గా సరిపోతుంది. పదేళ్లు తెలంగాణలో నంబర్‌వన్‌గా, తిరుగులేని శక్తిగా ఉన్న పార్టీ.. ఆరు నెలల క్రితం ఓటరు ఇచ్చిన తీర్పుతో ఇప్పుడు రాజకీయంగా నిలదొక్కుకోవడమే ప్రశ్నార్థకమైంది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలు కారు స్పీడ్‌కు బ్రేకులు వేయగా.. తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికలు.. కారును పంక్చర్ చేసింది.పదేళ్లు తెలంగాణకు తాను ప్రభువును అన్నట్లు వ్యవహరించిన కేసీఆర్ అతని కుటుంబాన్ని ప్రజాస్వామ్యంతో తమకున్న ఓటు అనే ఆయుధంతో కిందకు దించారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కూడా బీఆర్ఎస్ నేతల్లో అహంకారం తగ్గలేదు. ఇదే తరుణంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ బీఆర్ఎస్ పాలనలో జరిగిన స్కామ్‌లు, కుంభకోణాలను వెలికితీయడం మొదలు పెట్టింది. మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూడా ఢిల్లీ లిక్క స్కాం కేసులో కీలకంగా ఉన్న కేసీఆర్ కూతురును అరెస్టు చేసి జైలుకు పంపింది. దీంతో బీఆర్ఎస్‌కు చెందిన నేతలు ఇక ఆ పార్టీలో భవిష్యత్ లేదని కాంగ్రెస్, బీజేపీబాట పట్టారు.ఇక అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా.. లోక్‌సభ ఎన్నికల్లో ఉనికి చాటుకోవాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భావించారు. దీంతో ఆయనే స్వయంగా బస్సుయాత్ర ద్వారా ఎన్నికల ప్రచారం చేశారు. మరోవైపు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకుని గత ప్రభుత్వం చేసిన అన్ని కుంభకోణాలను అనతికాలంలోనే బయటపెట్టింది. ఇది లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి కారణమైంది. ఇక లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో మోదీ వేవ్ బాగా పనిచేసింది. కవితను అరెస్టు చేయకుండా అసెంబ్లీ ఎన్నికల్లో నష్టపోయిన బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం పుంజుకుంది. అధికార కాంగ్రెస్‌తో సమానంగా సీట్లు గెలుచుకుంది. దీంతో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా దక్కించుకోలేక చతికిలపడింది.ఒకవైపు అధికార కాంగ్రెస్, మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో నువ్వా నేనా అన్నట్లు తలపడ్డాయి. ఈ రెండు జాతీయ పార్టీలో దూకుడును ఉదుర్కొనేందుకు కేసీఆర్ ప్రయత్నం చేసినా.. తెలంగాణ ఓటర్లు బీఆర్ఎస్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. కేసీఆర్ పదేళ్లలో తప్పు చేశారని భావించారు. మరోవైపు ప్రస్తుతం బీఆర్ఎస్‌ను గెలిపించినా లాభం లేదన్న అభిప్రాయం తెలంగాణలో ఏర్పడింది. ఫలితంగా లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా సాధించలేదు. కేసీఆర్ బస్సుయాత్ర కూడా ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది. ఆ పార్టీ సున్నా సీట్లు గెలుచుకుంది.అసెంబ్లీ ఎన్నికల తర్వాతనే చాలా మంది నేతలు బీఆర్ఎస్‌ను వీడారు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఒక్క సీటు కూడా గెలవకపోవడంతో పార్టీ పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. దీంతో ఆ పార్టీలో ఉన్న నేతలు కూడా ఇప్పుడు పక్క చూపులు చూస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో టచ్‌లోకి వెళ్లారు. ఈ పరిస్థితిలో పార్టీని నిలబెట్టుకోవడం కేసీఆర్ ముందు ఉన్న పెద్ద సవాల్.

# చిత్రపురిలో మరో స్కామ్

హైదరాబాద్: హైదరాబాద్ చిత్రపురి కాలనీ హౌసింగ్ సొసైటీలో మరో స్కాం వెలుగు చూసింది. సొసైటీ భూముల్లో ట్విన్ టవర్స్ నిర్మాణం పేరుతో హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ కోట్లు వసూలు చేశారని బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కేటాయింపులో వందల కోట్లకు గోల్‌మాల్ జరిగినట్లు పోలీసు దర్యాప్తులో వెలుగుచూసిన తరుణంలో తాజాగా వసూళ్ల ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ రాయదుర్గం ప్రాంతానికి చెందిన రత్న శ్రీరంగ జాయింట్ వెంచర్స్ భాగస్వామి వైఎల్ అమర్‌నాథ్‌బాబు కొన్నేళ్లుగా నిర్మాణ రంగంలో ఉన్నారు. మణికొండ చిత్రపురికాలనీలో సినీ కార్మికుల కోసం 3.20 ఎకరాల విస్తీర్ణంలో జంట భవనాలు నిర్మాణ కాంట్రాక్టు చేపట్టాలని ఆయనకు ఒ.కళ్యాణ్ బాబు అనే మధ్యవర్తి ద్వారా సమాచారం అందింది. కళ్యాణ్‌బాబు మాటలు నమ్మిన అమర్‌నాథ్‌బాబు చిత్రపురి కాలనీ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్, కార్యదర్శి పిఎస్ఎన్ దొర, కోశాధికారి లలిత ఇతర కమిటీ సభ్యుల్ని కలిశారు. మొత్తం 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో టవర్స్ నిర్మాణానికి సంబంధించి టెండరు నమూనాలో కొటేషన్ ఇతర వివరాలు సమర్పించారు.కొన్ని రోజుల చర్చల తర్వాత రత్న శ్రీ రంగ సంస్థ పేరిట 2023 ఫిబ్రవరిలో భవన నిర్మాణ కాంట్రాక్టు ఒప్పందం కుదుర్చుకున్నారు. గతేడాది మార్చిలో అమర్‌నాథ్‌బాబు తన సంస్థ ఖాతా నుంచి అడ్వాన్సు కింద 3.20 కోట్లు హౌసింగ్ సొసైటీ ఖాతాకు బదిలీ చేశారు. ఆ తర్వాత అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ హెచ్ఎండిఏ అనుమతులు పేరిట 1.80 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేయగా ఓ మధ్యవర్తి ఇంట్లో నగదు రూపంలో చెల్లించారు. ఇదిగాక మరో 1.80 కోట్లు కళ్యాణ్ ఆరట్స్ పేరుతో ఉన్న బ్యాంకు ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. ఆ తర్వాత అనిల్‌కుమార్ డిమాండ్ మేరకు మధ్యవర్తిత్వం చేసిన కళ్యాణ్‌కు 20 లక్షలు చెల్లించారు. ప్రాజెక్టు చేపట్టడానికి ముందు అమర్‌నాథ్‌కు 15 లక్షలు ఖర్చయ్యాయి. ఈ ప్రక్రియ కొనసాగుతుండగా అకస్మాత్తుగా సొసైటీ అమర్‌నాథ్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇతర కాంట్రాక్టర్ల నుంచి అనధికారికంగా బిడ్లు ఆహ్వానించింది. తనను ఉద్దేశపూర్వంగా మోసం చేసిన అనిల్, మధ్యవర్తి కళ్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని అమర్‌నాథ్ ఫిర్యాదులో పేర్కొన్నారు.తనకు తెలిసిన సమాచారం ప్రకారం ఓ కాంట్రాక్టరు దగ్గర 15 కోట్లు అడ్వాన్సుగా తీసుకుని అనిల్‌కుమార్ ట్విన్ టవర్ల నిర్మాణానికి కొత్త ఒప్పందం కుదుర్చుకున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. గతంలో ఇదే చిత్రపురి కాలనీ ఇళ్లు కేటాయింపులో అవకతవకలపై చిత్రపురి కాలని హౌసింగ్ సొసైటీ ప్రెసిడెంట్ వల్లభనేని అనిల్‌ను రాయదుర్గం పోలీసులు కస్టడిలోకి తీసుకున్నారు. ఇళ్లు కేటాయింపులో అనర్హులకు, చిత్ర పరిశ్రమకు సంబంధం లేని వారికి ఇచ్చారని బాధితులు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వల్లభనేని అనిల్‌ను అరెస్టు చేశారు.

# రేషన్ కార్డుల కసరత్తు

హైదరాబాద్: తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు జారీపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. త్వరలోనే అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటన చేశారు. రేషన్ కార్డుతో ఆరోగ్యశ్రీ, పింఛన్, ఫీజు రీయింబర్స్మెంట్, ఇతర ప్రభుత్వ పథకాలు ముడిపడి ఉన్నాయి. దీంతో కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో రేషన్ కార్డుల జారీపై కీలక నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందించేందుకు కసరత్తు చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మూడు నెలల తర్వాత రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. దీంతో సామాన్యులకు డబ్బు ఆదా అవుతుందన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరలోనే తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కేబినెట్ భేటీలో ఈ విషయంపై చర్చించామని, విధి విధానాలు రూపొందిస్తున్నామన్నారు. రేషన్ కార్డుదారులకు 3 నెలల తర్వాత సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఈలోపు కొత్త రేషన్ కార్డులు కూడా జారీ చేస్తామన్నారు. సన్నవడ్లకు రూ. 500 బోనస్ ఇచ్చేందుకు మంత్రి వర్గ భేటీలో నిర్ణయం తీసుకున్నామన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను పేద, మధ్యతరగతి వారే లక్ష్యంగా అమలు చేస్తారు. సంక్షేమ పథకాల అర్హులను రేషన్ కార్డుదారుల ఆధారంగా గుర్తిస్తారు. సంక్షేమ పథకాలతో పాటు విద్యా, వైద్య సేవలకు రేషన్ కార్డు చాలా ముఖ్యం. దీంతో అర్హులు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తుంటారు. తెలంగాణ గత కొన్నేళ్లుగా కొత్త రేషన్ కార్డులు జారీ అవ్వలేదు. దీంతో అర్హులై ఉండి కూడా చాలా మంది సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రజాపాలన ద్వారా అర్హుల నుంచి సమాచారం సేకరించిన విషయం తెలిసింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులకు ఈ-కైవీసీ తప్పనిసరి చేసింది కేంద్రం. జూన్ 30తో ఈ కేవైసీ గడువు ముగుస్తుంది.

# కుల సర్వే " కసరత్తు కు నిపుణులతో- బీసీ కమిషన్ భేటీ

**కార్యాచరణ లో భాగంగా వివిధ రంగాల విషయ నిపుణులతో సుధీర్ఘ సమాలోచనలు**

**విధి విధానాల ఖరారుకు మేధావుల అభిప్రాయాలు కోరిన బీసీ కమిషన్**

హైదరాబాద్: కుల సర్వే " కసరత్తు కు నిపుణులతో- బీసీ కమిషన్ సోమవారం భేటీ ఐనది.కార్యాచరణ లో భాగంగా వివిధ రంగాల విషయ నిపుణులతో సుధీర్ఘ సమాలోచనలు నిర్వహించింది.విధి విధానాల ఖరారుకు మేధావుల అభిప్రాయాలు కోరిన బీసీ కమిషన్రాష్ట్రం లో త్వరలో చేపట్టబోయే "సామాజిక , ఆర్థిక కుల సర్వే" (కుల గణన) కు సంబంధించి, తాము వెలిబుచ్చిన మౌఖిక అభిప్రాయాలను, లిఖిత పూర్వక ప్రతిపాదనలను పరిశీలించి, తగు విధంగా చర్యలు చేపట్టడానికి వీలుగా, ప్రభుత్వానికి నివేదిక అందచేయాలని పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సస్ విషయ నిపుణులు, మేధావుల ప్రతినిధుల బృందం రాష్ట్ర బీసీ కమిషన్ ను కోరింది. సామాజిక,ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాలలో నిర్ధిష్టంగా "కుల సర్వే" మొదలు పెట్టడానికి గానూ, పూర్తి స్థాయి "కార్యాచరణ ప్రణాళిక" ( ఁఇబితినీని ఖశ్రీజీని) రూపొందించి ఇవ్వాలని, ప్రభుత్వం బీసీ కమిషన్ ను కోరింది. కాగా రాష్ట్రంలో ఇప్పటికే అధికారికంగా ాఅ,ాు,ఃఅ ఇతర అన్ని సామాజిక వర్గాలకు సంబంధించిన కులసర్వే చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.ఈ నేపథ్యం లోనే "కుల సర్వే" కు విధి విధానాల ఖరారు, ప్రశ్నావళి రూపకల్పన, అవలంభించాల్సిన పద్ధతులు మున్నగు అంశాలపై రాష్ట్ర బీసీ కమిషన్ పని మొదలు పెట్టింది.ఈ మేరకు రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, సభ్యులు సి. హెచ్ .ఉపేంద్ర, శుభ ప్రద్ పటేల్, కే. కిశోర్ గౌడ్, సభ్య కార్యదర్శి శ్రీమతి బి. బాల మాయ దేవి (ఐ.ఏ.ఎస్) లతో, పీపుల్స్ కమిటీ ప్రతినిధులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీ ఖైరతాబాద్(హైదరాబాద్) రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయం లో జరిగింది. ఈ సమాలోచనలలో జస్టిస్ చంద్ర కుమార్, ప్రొఫెసర్ మురళి మనోహర్, ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్ రావు , ప్రొఫెసర్ ఐ.తిరుమలి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ప్రొఫెసర్ సింహాద్రి, ప్రొఫెసర్ పద్మజాషా, ప్రొఫెసర్ నరేంద్ర బాబు, డాక్టర్ ఎస్ పృధ్వీ రాజ్ , దేవల్ల సమ్మయ్య , సతీష్ కొట్టే తదితరులతో కూడిన ప్రతినిధి బృందం మౌఖికం గా తమ అభిప్రాయాలను, సలహాలను, ఇచ్చింది. పలు ఆక్షేపణ లను వెలిబుచ్చింది. లిఖిత పూర్వకంగా పలు అధ్యయన పత్రాలను అందజేసింది. విషయ నిపుణులు, మేధావుల తో జరిగిన ఈ సమావేశం సుధీర్ఘంగా కొనసాగింది. ఈ సందర్భం గా తమిళనాడు, కర్ణాటక , ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల లో నిర్వహించిన "కుల సర్వే" లపై లోతుగా చర్చించారు.

ఆయా రాష్ట్రాలలో సర్వేలు చేస్తున్నపుడు ఉత్పన్నమైన న్యాయపరమైన సమస్యలు, ప్రజల స్పందన, సాంకేతికంగా వివిధ అంశాలు, సాఫ్ట్ వేర్ ను రూపొందించడం, ఇలా ఒక్కొక్కటిగా కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం..ఇప్పటికే బీసీ కమిషన్ దేశవ్యాప్తంగా సేకరించిన అధ్యయన వివరాలను వివిధపత్రాల రూపంలో అందచేశారు. మౌఖికంగా అనేక అంశాలను, సోదాహరణంగా ప్రతినిధుల బృందం కు వివరించారు. ఈ నేపథ్యం లో పీపుల్స్ కమిటీ తమ సంతృప్తి ని వ్యక్తం చేసింది.ప్రత్యేకంగా ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం ను అభినంధించింది. ఈ భేటీ ఫలవంతంగా జరిగిందని పీపుల్స్ కమిటీ తమ సంతోషాన్ని వ్యక్తం చేసింది. రాష్ట్ర బీసీ కమిషన్ కొనసాగిస్తున్న "కుల సర్వే" ఆక్షన్ ప్లాన్ తయారీ లో భాగంగా, త్వరలో రాష్ట్రం లోని అన్ని వర్గాల, ప్రతినిధులు, మేధావులు,ప్రజా, కుల సంఘాలను ఆహ్వానిస్తామని ఛైర్మన్ కృష్ణమోహన్ రావు తెలిపారు. వారంలోపే తేదీలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. అందరి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకొని, నిర్మాణాత్మకంగా, హేతుబద్ధం గా ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఆయన వివరించారు.

# ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు లో అధికారులు సమర్థవంతంగా పనిచేయాలి

**- జిల్లా అధికారులతో సమావేశం**

**- టీమ్ వర్క్ గా సమన్వయం తో పని చేయాలి**

**- మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ బి.విజయేందిర బోయి**





మహబూబ్ నగర్ (ప్రతినిధి, జూన్18(తీన్మార్ న్యూస్): ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరేందుకు అన్ని శాఖల అధికారులు టీమ్ వర్క్ తో పని చేయాలని, కార్యక్రమాల అమలులో నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.విజయేందిర బోయి అన్నారు. మంగళ వారం మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో నూతన జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి,ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, సమస్యలు ఆయా శాఖల వారీగా అధికారులు సమావేశం లో వివరించారు. అన్ని శాఖల అధికారుల సహకారం తో జిల్లాను అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు లో ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. ప్రజా వాణి ద్వారా ప్రజల నుండి వచ్చే దరఖాస్తులు పరిష్కరించడం లో గుణాత్మకంగా సమస్యలు పరిష్కారం చూపాలని సూచించారు. వర్షాలు పడుతున్నందున వైద్య ఆరోగ్య శాఖ ద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ రాజ్,గ్రామీణ నీటి సరఫరా శాఖ ల సమన్వయంతో అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశుధ్యం, వ్యాధుల నివారణకు అన్ని ముందస్తు కార్యక్రమాలను కార్యాచరణ ప్రణాళిక ననుసరించి చేపట్టాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లాలో వ్యవసాయ శాఖ ద్వారా వానా కాలం సాగు పంటల విస్తీర్ణం, పంటల సాగు, ఎరువులు, విత్తనాల సరఫరా గురించి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వివరించారు. విత్తనాలు, ఎరువుల సరఫరా గురించి ప్రతి రోజు రిపోర్ట్ చేయాలని సూచించారు. విద్యా శాఖ ద్వారా పాఠశాలలు ప్రారంభం కాగానే ఒక జత యూనిఫాం,పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు సరఫరా చేసినట్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా పాఠశాలల్లో అత్యవసర రిపేర్ పనులు 5 రకాల పనులు చేపట్టి నట్లు,మొదటి, రెండవ దశలో 642 పాఠశాలల్లో పనులు చేపట్టి నట్లు తెలిపారు. మొదటి దశలో చేపట్టిన 490 పాఠశాలల్లో పనులు పూర్తి కావచ్చినట్లు తెలిపారు. రెండవ దశలో 152 పాఠశాలల్లో పనులు పురోగతి లో నున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. ఎస్.సి.అభివృద్ధి శాఖ,ఎస్.టి., బి.సి., మైనార్టీ, ఇంటర్ మీడియర్ విద్య, వైద్య ఆరోగ్య శాఖ,పౌర సరఫరాల శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, పరిశ్రమల శాఖ, మిషన్ భగీరథ, మున్సిపాలిటీలు, గనులు, భూ గర్భ శాఖ, వివిధ శాఖల వారీగా వివరించారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకు రావాలని ఆమె సూచించారు. ఆయా శాఖల వారీగా ప్రతి నెల రెగ్యులర్ గా నిర్వహించే సమావేశాలు నిర్వహించి సమీక్ష చేయాలని అన్నారు. శాఖల వారీగా కార్యక్రమాల అమలు సమీక్ష చేయడం జరుగుతుందని వివరించారు. ఈ సమావేశం లో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్ రావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పరామర్శ



వనపర్తి ప్రతినిధి,జూన్ 18(తీన్మార్ న్యూస్): మంగళవారం వనపర్తి పట్టణం శ్రీనివాసపురం బిఆర్ఎస్ కార్యకర్త జక్కుల మన్యం యాదవ్ మరియు, మర్రికుంట 9వార్డులో చీర్ల బుచ్చన్న అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. ఇట్టి విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వారికి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. నిరంజన్ రెడ్డి వెంట మాణిక్యం, దేవర్ల నరసింహ, మాధవ్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, నరేష్, సంపత్ కుమార్ రెడ్డి, చిట్యాల, రాము, బాబు నాయక్, మురళీ సాగర్, వీరసాగర్, తిరుపతయ్య సాగర్, తోటశ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



రాజాపేట, జూన్ 18(తీన్మార్ న్యూస్): రాజాపేట మండలం దూది వెంకటాపురం గ్రామానికి చెందిన దగ్గుల సాయిలు అనారోగ్యంతో ఇటీవల మరణించగా ఆ కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.5000/- రూపాయలను నక్కిర్తి కనకరాజు మంగళవారం అందజేశారు. కుటుంబాన్ని పరామర్శించి మానసిక ధైర్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు అడ్డాకుల మండలంలో ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటన

**- యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యం.శరత్ కుమార్ రెడ్డి**



వనపర్తి ప్రతినిధి, జూన్ 18(తీన్మార్ న్యూస్): అడ్డాకుల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని, నూతన మరుగుదోడ్లను ప్రారంభించడానికి తేదీ 19, బుధ వారం రోజు సమయం :11:00 లకు నాయకులు దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) విచ్చేస్తున్నారు. కావున ఇట్టి కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, యూత్ కాంగ్రెస్, మహిళ కాంగ్రెస్, ఎన్ఎస్ యు ఐ,ఐఎన్టియు సి,సేవదళ్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనలని అడ్డాకుల మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు యం.శరత్ కుమార్ రెడ్డి తెలిపారు.

# రోడ్డు ప్రమాదాలలో గాయపడిన బాధితునికి మేఘారెడ్డి అభయహస్తం



వనపర్తి ప్రతినిధి, జూన్ 18(తీన్మార్ న్యూస్): పెద్దమందడి మండల పరిధిలోని వెూజర్ల గ్రామంలో సోమవారం బొలెరో వాహనం ఢీకొని పోతుల రాములు గౌడ్ అనే వ్యక్తి గాయపడ్డాడు. కుడి చేయి మూడు చోట్ల విరగడంతో బాధితుని ఆర్థిక పరిస్థితి గురించి వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తూడి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా తక్షణవే స్పందించిన శ్రీనివాస్ రెడ్డి రూ.5వేలు గ్రామ కాంగ్రెస్ నాయకులతో పంపాడు. ఎంపీపీ రఘు ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు కొత్తకాపు రామకృష్ణారెడ్డి లు బాధితుడిని ఆసుపత్రిలో పరామర్శించి, కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు.

# జపాన్ లో ప్రబలిన 48 గంటల్లో చంపేసే వ్యాధి

టోక్యో : కోవిడ్ మహమ్మారి తర్వాత ఇప్పుడు శరీర మాంసాన్ని తినేసే బ్యాక్టీరియా కారణంగా కలిగే అరుదైన జబ్బు ఇప్పుడు జపాన్ లో ప్రబలింది. ఈ జబ్బు 48 గంటల్లో చంపేస్తుంది.స్ట్రెప్టోకోకల్ టాక్సిక్ షాక్ సింద్రోమ్ (ఙుఊా) కేసులు ఈ ఏడాది జూన్ 2 నాటికి 977కి చేరుకున్నాయి, గత ఏడాది మొత్తంగా నమోదైన 941 కేసుల కంటే ఎక్కువ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్ ప్రకారం, ఈ సంస్థ 1999నుంచి ఇలాంటి సంఘటనలను ట్రాక్ చేస్తోంది.గ్రూప్ ఏ స్ట్రెప్టోకోకస్ (ఉఁా) సాధారణంగా "స్ట్రెప్ థ్రోట్" అని పిలవబడే జబ్బు పిల్లలలో వాపు, గొంతు నొప్పికి కారణమవుతుంది. అయితే కొన్ని రకాల బ్యాక్టీరియా వల్ల అవయవాల నొప్పి, వాపు,జ్వరం,తక్కువ రక్తపోటుతో సహా వేగంగా అభివృద్ధి చెందుతున్న లక్షణాలకు దారితీస్తుంది."చాలా మరణాలు 48 గంటల్లోనే జరుగుతాయి" అని టోక్యో ఉమెన్స్ మెడికల్ యూనివర్శిటీలో అంటు వ్యాధుల ప్రొఫెసర్ కెన్ కికుచి చెప్పారు. "ఒక రోగి ఉదయం పాదాల వాపును గమనించిన వెంటనే, అది మధ్యాహ్నం నాటికి మోకాలి వరకు విస్తరిస్తుంది ఆ తర్వాతవారు చనిపోవచ్చు"అని తెలిపారు.ప్రస్తుత ఇన్ఫెక్షన్ల రేటు ప్రకారం, జపాన్‌లో ఈ సంవత్సరం కేసుల సంఖ్య 2,500 కి చేరుకో వచ్చని, "భయంకరమైన" మరణాల రేటు 30 శాతం ఉందని కికుచి తెలిపారు.

# భూముల ధరల పెంపుదలపై మధనం

హైదరాబాద్, తెలంగాణలో పదేళ్లు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల్లో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. ఆరు గ్యారంటీలతోపాటు మేనిఫెస్టోలో 400కుపైగా హామీలు ఇచ్చింది. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా.. ఆరు గ్యారంటీలు అమలు కాలేదు. మరోవైపు మేనిఫెస్టోలోని హామీలు అమలు చేయాల్సిన అవసరం ఉంది. లోక్‌సభ ఎన్నికలు కూడా ముగియడంతో సీఎం రేవంత్‌రెడ్డి హామీల అమలుపై దృష్టిపెట్టారు.ప్రస్తుతం రేవంత్‌రెడ్డి రుణమాఫీకి సుదీర్ఘ కసరత్తు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన నిధులు సమీకరణపై దృష్టిపెట్టారు. రుణమాఫీ అర్హులను గుర్తించేందుకు కండీషన్లు పెట్టారు. ఈ నేపథ్యంలో నిధుల సమీకరణ రేవంత్‌కు సవాల్‌గా మారింది.శాఖల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్న ఆయా శాఖల నుంచి రావాల్సిన బకాయిలు సమీకరిస్తున్నారు. ఈ క్రమంలో భూముల విలువ పెంపుపైనా దృష్టి పెట్టారు. భూముల విలువ పెంచడం ద్వారా రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం పెరుగుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఖజానాకు వచ్చే ఆదాయంలో మద్యం మొదటి స్థానంలో ఉండగా, రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం తర్వాతి స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలోనే భూముల విలువ పెంచాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. తద్వారా భారీగా ఖజానాకు నిధులు వస్తాయని అంచనా వేస్తోంది.భూముల విలువ పెంపు విషయంలోనూ రేవంత్‌రెడ్డి జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఏపీలో 2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి మూడు నాలుగుసార్లు భూముల విలువలు సవరించారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం పెరిగింది కానీ, సామాన్యులకు ఎలాంటి లబ్ధి కలుగలేదు. దీంతోపాటు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు కూడా మొన్నటి ఎన్నికల్లో జగన్ ఓటమికి కారణమయ్యాయి.భూముల విలువ పెంపు అంటే .. డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోనే పెంచాలి. డిమాండ్ లేని ప్రాంతాల్లో భూముల విలువ పెంచితే అది ప్రభుత్వంపై వ్యతిరేకతకు దారితీస్తుందని నిపుణులు అంటున్నారు. ఇందుకు జగన్ చేసిన ప్రయోగమే నిదర్శనమంటున్నారు. జూన్ 15 లేదా 18న నిర్వహించే కేబినెట్ మీటింగ్‌లో భూముల విలువలు సవరించే అవకాశం ఉందని తెలుస్తున్న నేపథ్యంలో సీఎం రేవంత్ ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# గులాబీ నేతలకు వరుస నోటీసులు

కరీంనగర్: తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. రేవంత్ ప్రభుత్వం వేసిన కమిషన్లు బీఆర్ఎస్ నేతలకు నోటీసుల మీద నోటీసులు పంపించడంతో అధికారులు షాకవుతున్నారు. ఇప్పటికే విద్యుత్ కొనుగోలు, ప్లాంట్ల నిర్మాణంపై బీఆర్ఎస్ నేతలు, అధికారులకు జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి కమిషన్ నోటీసులు ఇచ్చింది. తాజాగా జస్టిస్ పినాకీ చంద్రఘోష్ కమిషన్ వంతైంది. బ్యారేజీల నిర్మాణాలతో సంబంధాలున్న గత ప్రభుత్వంలోని బాధ్యులైన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమైంది. పీసీ ఘోష్‌ను తన కార్యాలయంలో విలేకరులు కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, అఫిడవిల్లలో ఉన్న వివరాల ఆధారంగా నోటీసులపై తదుపరి నిర్ణయం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా మరోసారి తనిఖీలకు వెళ్లాలని భావిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం సాంకేతిక అంశాలపై విచారణ జరుపుతున్న కమిషన్, త్వరలో ఉల్లంఘనలపై ఫోకస్ చేయనుంది.ముఖ్యంగా డిజైన్, ప్లానింగ్, కన్‌స్ట్రక్షన్‌కు సంబంధించి కీలక సమాచారాన్ని రాబట్టింది. బ్యారేజీ సామర్థ్యం కంటే ఎక్కువగా నీటి నిల్వతో ఒత్తిడి పెరిగి, పునాది కింద నుంచి ఇసుక జారిపోవడం వల్లే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిందని వివరించింది. బ్యారేజీల వైఫల్యానికి నీటిని నిల్వ చేయడమే కారణమని నిపుణుల కమిటీ తేల్చిచెప్పింది. నీటి మళ్లింపు కోసమే వీటిని కట్టారని, నిల్వ చేసేందుకు డ్యామ్‌లు కట్టుకోవాలని స్పష్టం చేసింది.బ్యారేజీలను రిజర్వాయర్ మాదిరిగా వాడుకుని నీటిని నిల్వ చేశారని, మాన్యువల్ పాటించకుండా నీటిని వదిలారని, అందుకే బ్యారేజీలు డ్యామేజ్ అయ్యిందని కమిషన్ వెల్లడించింది. బ్యారేజీలపై రెండువారా ల్లోనే మధ్యంతర నివేదిక ఇవ్వాలని కమిటీకి సూచన చేసింది కమిషన్. శుక్రవారం కొందరు అధికారులను కమిషన్ విచారించనుంది. అంతేకాదు బ్యారేజీలపై విచారణలో భాగంగా ఓపెన్ కోర్టు కూడా నిర్వహించ నున్నట్లు కమిషన్ ప్రకటించింది. ప్రజలు నేరుగా హాజరై ప్రశ్నలు అడిగితే సమాధానాలు ఇస్తామని వెల్లడించింది. దీనికి సంబంధించి ఎవరి దగ్గరైనా సమాచారం ఉంటే కమిషన్‌కు అందజేయాలని సూచించింది.

# పాపం... జీవన్ రెడ్డి



మహబూబ్ నగర్ : మన్నే జీవన్ రెడ్డి.. పాలమూరు జిల్లా రాజకీయాల్లో ప్రస్తుతం ఈ పేరు తెలియని వారుండరు. ఇటీవలే జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి అందరి దృష్టి ఆకర్షించారు. అయితే ఖచ్చితంగా గెలుస్తామన్న ధీమాతో పోటీ చేస్తే, అనుహ్య ఓటమిని మూటగట్టుకున్నాడు. రాజకీయ అరంగేట్రంలోనే ఓటమిపాలై, కోలుకోలేని షాక్ కు గురిచేసింది. దీంతో గెలుపుతోనే ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలన్న ఆయన ఆశలు ఆవిరయ్యాయి.ఎమ్మెల్సీగా పోటీకి ముందే రాజకీయ ప్రవేశం కోసం చాలా ఏళ్ల నుంచే గ్రౌండ్ సిద్ధం చేసుకున్నారు మన్నే జీవన్ రెడ్డి. బాబాయ్ మన్నే శ్రీనివాస్ రెడ్డి సిట్టింగ్ ఎంపీగా ఉన్నప్పుడే జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో తనకంటూ ప్రత్యేకంగా క్యాడర్ ను సిద్ధం చేసుకున్నారు. అయితే అధికారికంగా బీఆర్ఎస్ లో చేరకపోయినా, ఆ పార్టీ కార్యకర్తలతో నిత్యం టచ్ లో ఉండేవారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకే ఆయన క్షేత్రస్థాయిలో పట్టు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారని జోరుగా చర్చలు సైతం నడిచాయి.అయితే అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ అధిష్టానం సిట్టింగ్ లకే సీట్లు ప్రకటించడంతో కొద్ది రోజులు నియోజకవర్గానికి దూరంగా ఉన్నారు. అనంతరం బీఆర్ఎస్ ఓటమి, జిల్లాలో పార్టీ పట్టు కోల్పోవడంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అధిష్టానం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరే క్రమంలోనే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశాన్ని హామీ తీసుకున్నారని జోరుగా చర్చలు నడిచాయి. తర్వాత ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ ఏఐసీసీ ప్రకటన సైతం జారీ చేసింది.ఇంతవరకు బాగానే ఉన్నా అసలు కథ ఎమ్మెల్సీ ఉపఎన్నికతోనే మొదలైంది. వాస్తవానికి స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ పార్టీకే మెజారిటీ సభ్యుల సంఖ్యా బలం ఉంది. భారీగా క్రాస్ ఓటింగ్ జరిగితే తప్ప కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం అసాధ్యం. కానీ పార్టీ అధికారంలోకి వచ్చిన జోష్, జిల్లాలో 12చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడంతో పాటు సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా కావడంతో విజయం నల్లేరు మీద నడకే అనుకున్నారు. ఎమ్మెల్సీ స్థానాన్ని కచ్చితంగా గెలవాలని ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు అందరూ సమిష్టిగా కృషి చేయాలని అదేశాలు సైతం జారీ చేసింది అధిష్టానం. సిట్టింగ్ స్థానాన్ని కాపాడునేందుకు అధికార కాంగ్రెస్ కు ఎదురొడ్డి బీఆర్ఎస్ పార్టీ సర్వశక్తులు ఒడ్డింది.కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం క్రాస్ ఓటింగ్ అనే అంశాన్ని గుర్తెరిగి, నియోజకవర్గాల వారీగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను గోవా క్యాంప్‌లకు తరలించారు. మాజీ ఎమ్మెల్యేలను ఇంఛార్జీలుగా పదిరోజుల పాటు క్యాంప్ లోనే ఉండేలా చేశారు. గులాబీ అధిష్టానం సైతం క్యాంప్ లను మానిటరింగ్ చేసింది. క్యాంపుల నుంచే నేరుగా పోలింగ్ కేంద్రాలకు తరలించడంతో కాంగ్రెస్ అనుకున్నంత స్థాయిలో క్రాస్ ఓటింగ్ జరగలేదు. దీంతో 109 ఓట్ల తేడాతో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి విజయం సాధించారు.సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలింగ్ పూర్తయిన రెండు నెలల తర్వాత కౌంటింగ్ జరిగింది. అన్ని రోజుల పాటు విజయంపై ధీమాగా ఉన్న మన్నే జీవన్ రెడ్డి.. కౌంటింగ్ ప్రారంభమైన గంటలోనే ఓటమిని గ్రహించి లెక్కింపు కేంద్రం నుంచి వెళ్లిపోయారు. వాస్తవంగా అదే బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటి చేస్తే ఎమ్మెల్సీగా మండలిలో అడుగుపెట్టేవారని, అనుహ్యంగా పార్టీ మారి ఓటమి కొనితెచ్చుకున్నారని ఆయన అనుచరులు లెక్కలు వేసుకుంటున్నారట. ఏది ఏమైనా నామినేటెడ్ కాకుండా బరిలో నిలిచి గెలిచే రాజకీయల్లోకి రావాలన్న ఆయన ఆశలు అడియాశలయ్యాయి.

# సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు బ్రెస్ట్ స్క్రీనింగ్ క్యాంప్




కమాన్ పూర్: సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు బ్రెస్ట్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని సింగరేణి సంస్థ రామగుండం రీజియన్ 3 జిఎం సుధాకర్ రావు తెలిపారు. 45 సంవత్సరాల వయస్సు పైబడిన సింగరేణి మహిళా ఉద్యోగులు మరియు అర్హత గల ఉద్యోగుల మహిళా కుటుంబ సభ్యుల కోసం సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, హైదరాబాద్ వారిచే ఈనెల 27 వ తేదీన ఉదయం 8:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు రామగుండం ఏరియా (గోదావరిఖని) హాస్పిటల్ లో బ్రెస్ట్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించబడునని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.సుధాకర రావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ కె.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్క్రీనింగ్ క్యాంపులో పరీక్షలు చేయించదలుచుకున్న మహిళలు ఈనెల 24 , 25 తేదీలలో సింగరేణి సంస్థ వారి రామగుండం ఏరియా ఆసుపత్రి లో పేర్లు నమోదు చేయించుకోవాలని అన్నారు. నమోదు చేయబడిన వంద మంది మహిళలకు మాత్రమే ఈ స్క్రీనింగ్ క్యాంప్ లో పరీక్షలు చేయబడునని, కావున ఇట్టి అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

# ఫోక్సో కేసులో మహిళ అరెస్టు

సిద్దిపేట టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ కేసు వివరాలు తెలియపరుస్తూ సోలంకి గైక్వాడ్ రాధ (27) భర్త పిల్లలతో కలిసి సిద్దిపేట పట్టణం హనుమాన్ నగర్ లో గత మూడు సంవత్సరాల క్రితం ఒక ఇంట్లో అద్దెకు ఉంటూ ఆ ఇంటి యజమాని మైనర్ కొడుకు తన మాయ మాటలతో లోబరుచుకుని ఆ బాలునితో బలవంతంగా శారీరకంగా కలిసేది, కొన్ని రోజులు గడిచిన తర్వాత ఆ బాలునితో ఎక్కడికైనా వెళ్ళిపోవాలని ఉద్దేశంతో అతన్ని బలవంతంగా ఒప్పించి సదరు నిందితురాలు బాలుడి ఇంట్లో ఉన్న డబ్బులు బంగారము బాలుడితో తెప్పించుకొని తన భర్త పిల్లలను ఇక్కడనే వదిలేసి బాలున్ని తీసుకొని చెన్నై వెళ్ళింది. ఆ బాలుని తల్లి తన కొడుకు కనిపించడం లేదని పై నిందితురాలపై అనుమానం ఉన్నదని దరఖాస్తు ఇవ్వగా సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగింది. కేసు పరిశోధనలో భాగంగా టెక్నాలజీ ద్వారా సదరు మహిళ నిందితురాలు చెన్నైలో ఉన్నట్లు తెలిసింది. ఎలాగైనా పోలీసులు పట్టుకుంటారని తేదీ: జూన్11-06 రోజున ఆ బాలుని సిద్దిపేటలో వదిలివేయగా తన ఇంటికి చేరుకున్నాడు. సదరు బాలుడిని తన తల్లి పోలీస్ స్టేషన్కు తీసుకుని రాగా బాలుని ఏమి జరిగిందని విచారించగా చెన్నైలో ఒక రూమ్ కిరాయికి తీసుకొని అక్కడే తనను ఉంచి సదరు మహిళా బలవంతంగా శారీరకంగా కలవమని ఇబ్బంది పెట్టగా కలుసుకునే వారిని అని తెలిపినాడు.

బాలుని వెంట తీసుకొని వెళ్ళిన డబ్బులు ఖర్చయిన తర్వాత తీసుకొని వెళ్ళిన బంగారాన్ని చెన్నైలో గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మగా వచ్చిన డబ్బులు కూడా జల్సాలకు ఖర్చు అయినాయి పై నిందితురాలు మహిళను పట్టుకొని పోక్సో కేసులో అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్కు పంపించడం జరిగిందని టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# అక్రమ సంబంధం కోసం భర్త హత్య

అదిలాబాద్: అదిలాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. ప్రియుడి మోజులో పడ్డ భార్య భర్తను హత్య చేసింది. ఎవరికీ తెలియకుండా అనుమానాస్పద మృతిగా చిత్రీకరించేందుకు ప్రయత్నాలు చేసింది. లోతుగా విచారణ చేసిన పోలీసులకు అసలు గుట్టు తెలిసింది. ఆదిలాబాద్‌లో జాదవ్ గజానంద్ జైనాథ్ అనే ఉపాధ్యాయుడు రెండు రోజుల క్రితం అనుమానాస్పద స్థితి హత్యకు గురయ్యారు. 40 ఏళ్లు ఉన్న ఆ వ్యక్తిని ఎవరు చంపి ఉంటారో తెలియక పోలీసులు తలలు పట్టుకున్నారు. అన్ని కోణాల్లో విచారించిన పోలీసులకు అతని భార్య చేసిన ఫోన్ కాల్స్ గుట్టు విప్పాయి. అనేక రకాలుగా విచారించిన పోలీసులు... చివరకు భార్యను కూడా విచారించారు. ఆమె కూడా ఎలాంటి అనుమానం రాకుండా జాగ్రత్త పడింది. ఆమె ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు... ఆమె కాల్ లిస్ట్‌ను కూడా ట్రాక్ చేశారు. దీంతో ఆమె కొన్ని రోజులుగా పదే పదే కాల్ చేసిన నెంబర్లు ద్వారా కేసును ఛేదించారు. జాదవ్ గజానంద్ జైనాథ్ భార్య విజయలక్ష్మి అదే గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తితో ప్రేమలో పడింది. తమ బంధానికి అడ్డు వస్తున్నారని భర్తను ఎలిమినేట్ చేయడానికి సిద్ధపడింది. మహేష్‌తో కూర్చొనిప్లాన్ చేసి సుపారీ గ్యాంగ్‌తో భర్త మర్డర్‌కు స్కెచ్ వేసింది. అనుకున్నట్టుగానే సుపారీ గ్యాంగ్‌తో విజయలక్ష్మి మాట్లాడారు. వారిని ఫోన్లో మాట్లాడుతూ భర్త వచ్చి వెళ్లే టైం,తిరిగే ప్రాంతాల గురించి ఇన్ఫర్మేషన్ అందించింది. ఒప్పందం చేసుకున్నట్టుగానే జాదవ్ గజానంద్ జైనాథ్ ను సుపారీ గ్యాంగ్ లేపేసింది. భర్త హత్య గురించి తెలుసుకొని బోరున విలపించినట్టు నటించింది. పోలీసులకి కూడా ఫిర్యాదు చేసింది. అటు తిరిగి ఇటు తిరిగి చివరకు పోలీసులు ఆమె వద్దకు వచ్చి ఆగారు. ఆమె సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని చూస్తే మహేష్‌తో క్లోజ్‌గా ఉన్న ఫొటోలు, కాల్స్ చేసిన గుట్టు రట్టు అయింది. సుపారీ గ్యాంగ్‌తో డీల్ మాట్లాడిన విషయం కూడా వెలుగులోకి వచ్చింది. ఉపాధ్యాయుడి మర్డర్ గుట్టు వీడటంతో మహేష్, విజయలక్ష్మిని పోలీసులు అరెస్టు చేశారు. సుపారీ గ్యాంగ్ కోసం వేట కొనసాగిస్తున్నారు.

# ఇక టీ కాంగ్రెస్ పై గురి...

ఖమ్మం: పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయి. తెలంగాణ కాంగ్రెస్‌లో మార్పులు, చేర్పులకు వేళ అయింది. అటు పార్టీలో, ఇటు ప్రభుత్వంలో మార్పులకు శ్రీకారం చుట్టాలని భావిస్తోంది కాంగ్రెస్ పార్టీ. ఇప్పటికే ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి అధిష్టానంతో చర్చలు జరిపారు. కొత్త పీసీసీ విషయంలో ఇప్పటికే తన ఆలోచనలు పంచుకున్న సీఎం.. క్యాబినెట్ విస్తరణ విషయంలో కూడా పార్టీ అధిష్టానం నుంచి గ్రీన్‌సిగ్నల్ తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే పీసీసీ మార్పు తర్వాతే ప్రభుత్వంలో మార్పులు చేర్పులు చేయాలని నిర్ణయించినట్లు టాక్.ప్రస్తుతం పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి ఇటు ప్రభుత్వ అధినేతగా ముఖ్యమంత్రిగా కూడా ఉన్నారు. ఈ నెల 27తో పీసీసీ చీఫ్‌గా ఆయన మూడేళ్ల పదవీకాలం ముగియనుంది. ఆయన టర్మ్ ముగుస్తుండటంతో.. కొత్త పీసీసీ చీఫ్ ఎంపికపై పార్టీ అధిష్టానం దృష్టిపెట్టింది. పార్టీని నడిపించే నవ నాయకుడి కోసం కసరత్తు చేస్తోంది హైకమాండ్. రెడ్డినా లేక బీసీ నేతకు పార్టీ పగ్గాలు అప్పగించాలా అనేదానిపై చర్చోపచర్చలు జరుపుతోంది. తెలంగాణలో పార్టీ అధికారంలో ఉండటంతో.. పీసీసీ చీఫ్ రేసులో చాలామంది నేతలే ఉన్నారు. ప్రభుత్వంలో కీలక పదవుల్లో ఉన్న నేతలు కూడా పార్టీ అధ్యక్ష పదవి కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.తెలంగాణలో కూడా కర్ణాటక తరహా పార్టీ పగ్గాలు అప్పగించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరుతున్నారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్.. పీసీసీ చీఫ్ కూడా కొనసాగుతున్నారు. ఇక్కడ కూడా పీసీసీ పగ్గాలు తనకు అప్పగించాలని భట్టి పట్టుబడుతు న్నారు. ఇక సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని పీసీసీ చీఫ్ నియామకం ఉండే అవకాశాలు ఉండటంతో..బీసీ నేతలు తీవ్ర ప్రయత్నాలే చేస్తున్నారు.బీసీ సామాజికవర్గం నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ పీసీసీ చీఫ్ రేసులో ఉన్నారు. బీసీ సామాజిక వర్గం నుంచే జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, మాజీ అంజన్ కుమార్ యాదవ్ పేర్లు కూడా తెరపైకి వస్తున్నాయి. ఇక ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్, ఎస్టీ సామాజిక వర్గం నుంచి మంత్రి సీతక్క, ఎంపీ బలరాం నాయక్ పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి.పీసీసీ రేసులో తెరపైకి వస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, సీతక్కలు ఇప్పటికే ప్రభుత్వంలో ఉన్నారు. వీరిలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాత్రం మంత్రి పదవి లేకపోయినా.. పీసీసీ చీఫ్ కావాలని అడుగుతున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. మిగతా ఇద్దరు భట్టి, సీతక్క మంత్రి పదవులు వదులుకోవడానికి సిద్ధపడటం లేదని తెలుస్తోంది.పీసీసీ చీఫ్ విషయంపై త్వరలోనే కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఈ నెలాఖరులోపే అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నారు హస్తం పార్టీ నేతలు. పీసీసీ చీఫ్ నియామకంపై స్పష్టత వచ్చిన తర్వాత ప్రభుత్వంలో కూడా మార్పులు, చేర్పులు చేసే చాన్సుంది. పీసీసీ చీఫ్‌తో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్లు, జాతీయ స్థాయిలో పార్టీ జనరల్ సెక్రటరీలు, ఇతర ముఖ్యపోస్టుల భర్తీని దృష్టిలో పెట్టుకొని క్యాబినెట్ విస్తరణ ఉండనున్నట్లు చర్చ జరుగుతోంది.క్యాబినెట్‌లో ప్రస్తుతం సీఎంతో పాటు 11 మంది మంత్రులున్నారు. ఇంకా ఆరుగురిని మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉంది. మిగతా ఆరుగురు మంత్రులను సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా తీసుకునే అవకాశం ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. సీఎంకు అనుకూలంగా ఉన్న నేతలతో పాటు..కొన్ని సామాజికవర్గాలకు అవకాశం కల్పించడం, ప్రాతినిధ్యం లేని జిల్లాల్లో సీనియర్ నేతలకు అవకాశం కల్పించాలని చూస్తున్నారు.పీసీసీ చీఫ్ నియామకం జరిగితే కానీ..క్యాబినెట్ విస్తరణ జరిగే అవకాశం లేదంటున్నారు హస్తం పార్టీ లీడర్లు. పార్టీ పదవులు దక్కనివారికి క్యాబినెట్ బెర్తులు దక్కే చాన్స్ ఉండదంటున్నారు. ఒకవేళ పీసీసీ, ఏఐసీసీలో పదవులు దక్కితేవారికి క్యాబినెట్ విస్తరణలో చోటు దక్కే అవకాశం లేదని అంటున్నారు కాంగ్రెస్ లీడర్లు.

# ఆర్టీసీ డ్రైవర్ కు చుక్కలు చూపించిన మహిళ

వరంగల్, ఆర్టీసీ బస్సును ఎక్కే వరకు ఆపకుండా వెళ్లిపోవడంపై ఓ మహిళా ప్రయాణికురాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటో ద్వారా వెంబడించి మరీ బస్సుకు అడ్డంగా ఆటోను ఆపి ఆందోళనకు దిగారు. ఈ ఘటన వరంగల్ నగరంలో చోటుచేసుకుంది. నెక్కొండ మండలం పత్తిపాక గ్రామానికి చెందిన చాగంటి మంజుల తన ముగ్గురు పిల్లలతో కలసి జగిత్యాల జిల్లా కొండగట్టులో ఉంటున్నారు. పిల్లలతో కలిసి వరంగల్ వచ్చారు. వరంగల్ బస్టాండ్ నుంచి నెక్కొండ వెళ్ళడానికి తన ముగ్గురు పిల్లలతో కలిసి వేచి చూస్తున్నారు. ఈ క్రమంలో నెక్కొండ–మహబూబాబాద్? వెళ్లే ఆర్టీసీ బస్సు వచ్చింది. ఆ బస్సులో తన ఇద్దరు కూతుళ్లను సామగ్రితో సహా ఎక్కించారు. దివ్యాంగుడైన తన కుమారుడిని లోపలికి ఎక్కించడానికి బస్సు కండక్టర్ నిరాకరించాడు. అప్పటికే బస్సు నిండిపోయి.. ఒకరినొకరు తోసుకునే పరిస్థితి రావడంతో దివ్యాంగుడైన తన కుమారుడిని ఎక్కించడానికి 'బస్సులో ఖాళీ లేదు.. మరో బస్సులో రావాలని' కండక్టర్ సూచించారు. అప్పటికే తన ఇద్దరు కుమార్తెలు బస్సులో ఉన్నారన్న విషయం తెలియని డ్రైవర్.. కండక్టర్ సూచన మేరకు ముందుకు పోనిచ్చారు. దీంతో ఆగ్రహానికి గురైన మహిళా ప్రయాణికురాలు కొంతదూరం బస్సు వెనకాల పరుగెత్తారు. చివరకు ఓ ఆటో తీసుకొని వెళ్లి శివనగర్ అండర్ బ్రిడ్జి వద్ద బస్సును అడ్డగించారు. నడి రోడ్డుపై శివమెత్తిన మహిళ తన ప్రతాపం చూపించారు. బస్సు ఎందుకు ఆపలేదని బస్సుకు అడ్డంగా పడుకొని నిరసన తెలిపారు. తన ఇద్దరు పిల్లలు బస్సులో ఉండగా, దివ్యాంగుడైన కుమారుడిని ఎక్కించుకోకుండా ఎలా వెళతారని బస్సు డ్రైవర్, కండక్టర్లపై అగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు అరగంటకుపైగా బస్సు ముందుకు కదలకుండా అడ్డుకోవడంతో.. ప్రయాణికులు వచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. మీ కుమారుడిని ఆటోలో నుంచి తీసుకొచ్చి బస్సు ఎక్కిస్తే కలిసి వెళ్దామని చెప్పినా.. అందుకు ఆమె అంగీకరించలేదు. ఆటో ఛార్జీలు ఎవరిస్తారని ప్రశ్నించి పట్ట పగలే చుక్కలు చూపించింది. బస్సును తిరిగి బస్టాండ్?కు తీసుకెళ్లి.. తన కుమారుడిని ఎక్కించుకొని రావాలని పట్టుబట్టింది. ఈలోగా ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మహిళా ప్రయాణికురాలిని పక్కకు తీసుకెళ్లి శాంతింపజేశారు. బస్టాండ్‌లో ఉన్న దివ్యాంగుడిని ఎక్కించి ఆగిన బస్సును పంపించడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

# విద్యార్థి సంఘాల నేతలకు ఎస్పీ హెచ్చరిక

సిద్దిపేట: సిద్దిపేటలో జిల్లాలో ఉన్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఎవరు కూడా చట్టాన్ని చేతిలోకి తీసుకొని బలవంతంగా స్కూల్స్ బంద్ చేయించడం స్కూల్లో వద్దకు వెళ్లి పిల్లలకు ఇబ్బంది కలిగించడం వంటి కార్యక్రమాలు నిర్వహించకూడదు. స్కూల్ పిల్లల తరఫున ఏవైనా సమస్యలు ఉంటే విద్యార్థి సంఘాల నాయకులు, డిఇఓ లేదా, సంబంధిత డిపార్ట్మెంట్ అధికారులకు, లేదా కలెక్టర్ గారిని కలసి రిప్రజెంటేషన్ ఇవ్వాలని వారు ఆ సమస్యలపై స్కూల్లో యాజమాన్యాలతో మాట్లాడి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు.విద్యార్థి సంఘాల నాయకులు చట్టాన్ని చేతిలోకి తీసుకొని స్కూల్లో ముందు ధర్నాలు రాస్తారోకోలు చేసి స్కూల్ పిల్లలకు ఇబ్బంది కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు.

# జూలై 24న కేంద్ర బడ్జెట్...

న్యూఢిల్లీ, హ్యాట్రిక్ విజయం సాధించి వరుసగా మూడోసారి కొలువుదీరిన మోదీ సర్కార్, ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌పై కసరత్తు ప్రారంభించింది. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం జులై 22న ఈ బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. త్వరలో ప్రారంభమయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కాకుండా.. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ కసరత్తులో భాగంగా నార్త్‌బ్లాక్‌లోని ఆర్థిక శాఖ కార్యాలయంలో సందర్శకుల ప్రవేశంపై ఆంక్షలు ప్రారంభమయ్యాయి. సాధారణంగా ప్రతి ఏటా బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రవేశపెడుతారు. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన 'ఓటాన్ అకౌంట్' బడ్జెట్ మాత్రమే ప్రవేశపెట్టాల్సి వచ్చింది. ఇది ఎన్నికలు ముగిసి, కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే వరకు మాత్రమే అమల్లో ఉంటుంది. ఎన్నికల తర్వాత వచ్చే ప్రభుత్వానికే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే అధికారం ఉంటుంది. ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (ఃఏఖ) సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఔఆం) గెలుపొంది సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే 2014, 2019 మాదిరిగా బీజేపీకి సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజారిటీ రాలేదు. గత రెండు పర్యాయాలు తాము కోరుకున్న రీతిలో బడ్జెట్ ప్రవేశపెడుతూ వచ్చిన మోదీ సర్కారు, త్వరలో ప్రవేశపెట్టనున్న పూర్తిస్థాయి బడ్జెట్‌పై గుత్తాధిపత్యం కొనసాగిస్తుందా లేక మిత్రపక్షాల డిమాండ్లకు చోటిస్తుందా అన్నది చర్చనీయాంశంగా మారింది.కొత్త ప్రభుత్వంలోనూ కీలకమైన ఆర్థిక శాఖ మంత్రిగా నిర్మల సీతారామన్‌ను కొనసాగిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్ణయం తీసుకున్నారు. ఆర్థిక శాఖ మంత్రిగా ఆమె ఇప్పటికే 6 పర్యాయాలు బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈసారి ప్రవేశపెట్టే బడ్జెట్ 7వది. బడ్జెట్ రూపకల్పన సందర్భంగా వివిధ వర్గాలతో సమావేశాలు నిర్వహించడం, వారి ఆకాంక్షలను తెలుసుకుని తదనుగుణంగా బడ్జెట్ తయారుచేయడం ఆనవాయితీ. ఆ ప్రకారం రైతు సంఘాల నుంచి వ్యాపారవర్గాల వరకు అందరినీ కలుస్తుంటారు. ప్రస్తుతం ఆ ప్రక్రియ మళ్లీ మొదలైంది. అయితే బడ్జెట్‌పై కోటి ఆశలతో ఎదురుచూసేది మాత్రం వేతన జీవులే. రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి సంపాదించిన సొమ్ములో ఆదాయపు పన్ను రూపేణా కేంద్ర ప్రభుత్వం ముక్కుపిండి వసూలు చేయడంతో పాటు పరోక్షంగా అనేక రూపాల్లో పన్నుల దాడికి గురవుతుంటారు. వందలు, వేల కోట్లు ఆర్జించే వ్యాపార, పారిశ్రామిక వర్గాల్లో చాలా వరకు తప్పుడు లెక్కలు చూపించి పన్ను ఎగవేస్తుంటారు. ఈ పరిస్థితుల్లో సామాన్య వేతన జీవులు ప్రభుత్వం తమపై మోపుతున్న పన్ను భారాన్ని తగ్గిస్తుందా అని ఆశగా ఎదురుచూస్తుంటారు. ఇప్పటికే 6 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మల సీతారామన్‌పై వేతన జీవులకు సదభిప్రాయం లేదు. ఈసారైనా తమపై కరుణచూపి పన్ను శ్లాబుల్లో మార్పుల రూపంలోనో.. లేక పన్ను మినహాయింపుల రూపంలోనో ఊరట కల్గిస్తారా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇదే మాదిరిగా వ్యవసాయ, వ్యాపార, తయారీ రంగాలవారు కూడా ఈ బడ్జెట్ ద్వారా తమకు లభించే ప్రోత్సాహకాలు, పన్ను రాయితీల గురించి ఎదురు చూస్తుంటారు. దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలంటే ప్రభుత్వం వద్ద దండిగా నిధులుండాలి. ప్రభుత్వ గడించే ఆదాయంలో పన్నులు, సుంకాల రూపంలోనే ఎక్కువగా ఉంటుంది. పన్ను రేట్లు తగ్గిస్తే ఆదాయం తగ్గుతుంది. ఆదాయం తగ్గితే అభివృద్ధి తగ్గుతుంది. కాబట్టి ఇదొక అంతులేని కథలా కొనసాగుతుంది.కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక కొత్తగా ఎన్నికైన లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నిక కోసం పార్లమెంట్ ప్రత్యేకంగా సమావేశమవుతుంది. ఈ ప్రత్యేక సమావేశాలు జూన్ 24న ప్రారంభమై జులై 3న ముగుస్తున్నాయి. తొలి రెండు రోజులు (జూన్ 24, 25) కొత్త ఎంపీల ప్రమాణ స్వీకారంతోనే సరిపోతుంది. మొత్తం 543 మంది సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. సభలో సీనియర్ సభ్యుడిని రాష్ట్రపతి ప్రొటెం స్పీకర్‌గా నియమిస్తారు. 18వ లోక్‌సభకు ఎన్నికైన సభ్యుల్లో మధ్యప్రదేశ్‌లోని తికంగఢ్ స్థానం నుంచి బీజేపీ తరపున గెలుపొందిన వీరేంద్ర కుమార్, కేరళకు చెందిన కాంగ్రెస్ ఎంపీ కొడిక్కున్నిల్ సునీల్ సీనియర్ సభ్యులుగా ఉన్నారు. ఇద్దరూ 8 పర్యాయాలు లోక్‌సభకు గెలుపొందారు. అయితే వీరిలో వీరేంద్ర కుమార్‌ను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకున్నందున కాంగ్రెస్ సభ్యుణ్ణి ప్రొటెం స్పీకర్‌గా తీసుకుంటారా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జూన్ 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నికల జరగనుంది. ఈ పదవి కోసం రేసులో పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీగా ఉన్న దగ్గుబాటి పురందేశ్వరి పేరు రేసులో వినిపిస్తోంది. కేంద్ర మంత్రివర్గంలో ఆమెకు చోటు కల్పించలేదు కాబట్టి 'నారీశక్తి' నినాదంలో భాగంగా ఆమెకు స్పీకర్ పదవి కట్టబెట్టే అవకాశం ఉందన్న విశ్లేషణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే అనూహ్య నిర్ణయాలు తీసుకునే మోదీ–షా ద్వయం ఈసారి స్పీకర్‌గా ఎవరికి అవకాశం కల్పిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు లోక్‌సభతో పాటు రాజ్యసభ 264వ సెషన్ జూన్ 27 నుంచి ప్రారంభమవుతుంది.

అంటే లోక్‌సభ తొలి రెండు రోజులు సభ్యుల ప్రమాణ స్వీకారం, మూడో రోజు స్పీకర్ ఎన్నిక పూర్తిచేసిన తర్వాత రాజ్యసభ మొదలవుతుంది. అదే రోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం ఉంటుందని పార్లమెంట్ వర్గాలు వెల్లడించాయి. ప్రతియేటా బడ్జెట్ సమావేశాల్లో ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం ఉంటుంది. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగించారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ నేపథ్యంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లోనే రాష్ట్రపతి ప్రసంగం ఉండేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రసంగం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఏం చేయదల్చుకుందో చెప్పే ప్రయత్నం చేస్తుంది.

# పరిపాలనపై పట్టు సాధించని రేవంత్

హైదరాబాద్, తెలంగాణలో పరిపాలన ఇంకా గాడిన పడలేదు. ప్రభుత్వం ఇంకా కిందా మీదా పడుతోంది. ప్రతీ విషయంలోనూ వివాదాస్పదమవుతోంది. మద్యం బ్రాండ్ల విషయంలో ఏం జరిగిందో అంతా గందరగోళంగా మారిపోయింది. అధికారంలోకి వచ్చిన తర్వాతే పాఠ్యపుస్తకాలు ప్రింటింగ్ చేసినా.. అందులో సీఎం కేసీఆర్ అంటూ పేజీలు ముద్రించారు. అవి పంపిణీకి వచ్చే వరకూ ఎవరూ గుర్తించలేదు. మరో వైపు గత ప్రభుత్వంలో అవినీతి పై జరుగుతున్న విచారణల్లో ఒకరు ముందు.. మరొకరు వెనక్కి లాగుతున్నారు. చివరికి ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ ప్రభుత్వానికి క్లారిటీ లేకుండా పోయింది. ఈ మొత్తం వ్యవహారాలన్నీ చూస్తే సీఎం రేవంత్ రెడ్డికి ప్రభుత్వంపై పూర్తి పట్టు లేదన్న అభిప్రాయం కలుగుతుంది. అదే నిజమని జరుగుతున్న పరిణామాలు నిరూపిస్తున్నాయి. ముఖ్యమంత్రి అంటే ఓ వ్యక్తి కాదు. వ్యవస్థ. మొత్తం వ్యవహారాలపై ఎప్పటికప్పుడు సమాచారం ఉండాలి. ముఖ్యమంత్రి అంటే ప్రభుత్వాన్ని ఒంటి చేత్తో నడిపించగలగాలి. తన కనుసన్నల్లో పాలన చేయగలగాలి. లేకపోతే ప్రతి ఒక్కరూ ఓ సీఎంలా వ్యవహరిస్తారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అదే జరుగుతోంది. మంత్రిత్వశాఖల్లో ఏం జరుగుతుందో సీఎంకు తెలియడం లేదు. ముఖ్యంగా ఎక్సైజ్ శాఖలో కొత్తగా ఎలాంటి లిక్కర్ షాపులకు అనుమతులివ్వ లేదని ఆబ్కారీ శాఖ మంత్రి గత నెలలో ప్రకటించారు. మంత్రి ప్రకటించిన వారం రోజులకే ఇతర రాష్ట్రాల బీర్ల కంపెనీలకు సరఫరాకు అబ్కారీ శాఖ గ్రీన్‌సిగల్ ఇచ్చింది. ప్రతి పక్షాలతోపాటు స్వపక్షంలోనూ తీవ్ర వ్యతిరేకత రావడంతో వాటి అనుమతులను తాత్కాలికంగా నిలిపివేశారు. అనుమతులు పొందిన సదరు కంపెనీలపై దేశ వ్యాప్తంగా అనేక ఆరోపణలున్నాయనీ, రాష్ట్రాల ఖజానాలకు గండికొడుతూ, ప్రభుత్వ సంస్థల వద్ద రుణాలను తీసుకొని ఎగ్గొడుతూ, కల్తీ మద్యం వ్యాపారం చేశాయని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సదరు కంపెనీలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమైంది. నిబంధనల మేరకే సోమ్ డిస్టిలరీ కంపెనీకి మద్యం సరఫరా చేసేందుకు అనుమతిచ్చామని ఎక్సైజ్ శాఖ మంత్రి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. డిమాండ్ ను బట్టి కొత్త కంపెనీలకు బెవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ అనుమతులను మంజూరు చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. కానీ ఏదో జరుగుతోందన్న అభిప్రాయం ప్రజల్లో బలపడింది. ఈ అంశంపై ముఖ్యమంత్రికి సమాచారం లేదని.. అందుకే త్వరలో ఎక్సైజ్ శాఖపై సమీక్ష చేయాలనుకుంటున్నారని అంటున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలకుపైగా అవుతోంది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో బుధవారం పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు అధికారులు పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్‌లు పంపిణీ చేశారు. అయితే, విద్యాశాఖ వీటిలో ముందుమాట మార్చకుండానే కొత్త బుక్స్ ముద్రించింది. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్నామన్న ఉత్సాహంతో గత బీఆఎస్ ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి పేర్లతో పాఠ్య పుస్తకాల్లో ముద్రించి పంపిణీ చేశారు. పాఠ్యపుస్తకాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్, మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, కడియం శ్రీహరి, సంచాలకులు జగదీశ్వర్ పేర్లు ఉన్నాయి. 24 లక్షల పుస్తకాల్లోని ముందుమాటలో మార్పులు చేయకుండా రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహించారు ఈ విషయం సోషల్ మీడియాలో రావడంతో పాఠశాల విద్యాశాఖ ఆగమేఘాల మీద ఆయా పుస్తకాలను వెనక్కి తీసుకోవాలని ఆదేశించింది. కానీ తర్వాత ఆ పేజీ వరకూ స్టిక్కర్లు అంటించాలని చెప్పింది. ఈ వ్యవహారం అంతా గందరగోళంగా మారింది. చివరికి ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విభాగం డైరెక్టర్ శ్రీనివాసచారి, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రాధారెడ్డిలను తొలగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వంలో అనేక అవకతవకలు జరిగాయని విచారణలకు ఆదేశించారు. అందులో వేగం లేకపోవడం వెనుక ప్రభుత్వంలోని వివిధ స్థాయిల వ్యక్తులు జోక్యం చేసుకోవడమే అన్న వాదన వినిపిస్తోంది. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ కేసు ఎటు వైపు తిరుగుతుందో ఎవరికీ అర్థం కావడం లేదు. చివరికి అది కోల్డ్ స్టోరీజీకి చేరిందన్న వాదన వినిపిస్తోంది. ఈ కేసు దర్యాప్తు విషయంలో అనేక మంది జోక్యం చేసుకున్నారన్న గుసగుసలు కాంగ్రెస్ లో ఉన్నాయి. అలాగే కాళేశ్వరం, విద్యుత్ ఒప్పందాలపై జరిగుతున్న విచారణల్లోనూ అదే పరిస్థితి. స్వయంగా కొంత మంది ఇంజినీర్లు టెలీ కాన్ఫరెన్స్ పెట్టుకుని కాళేశ్వరం విషయంలో అందరం ఒకే మాట చెబుతామని ఒప్పందానికి వచ్చారని బయటపడింది. ఇది తెలిసి ఉత్తమ్ కుమార్ రెడ్డి వారికి వార్నింగ్ ఇచ్చారని మీడియాకు లీకులు ఇచ్చారు. కానీ అసలు అంతకు మించి ఏదో జరుగుతోందని.. అది ముఖ్యమంత్రి దాకా వెళ్లడం లేదని రాజకీయవర్గాలు అంటున్నాయి.రేవంత్ సీఎం అయినప్పటికీ పలు శాఖల్ని సీనియర్లు నిర్వహిస్తున్నారు. వారికి రేవంత్ సలహాలు, సూచనలు ఇచ్చే అవకాశం లేదు. వారి శాఖల్లోనే వివాదాలు ఉన్నాయి. ముఖ్యమంత్రిగా రేవంత్ అన్నింటికీ బాధ్యుడు. కానీ ఆయన ప్రభుత్వంపై పట్టు పెంచుకోవడానికి అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. ఫలితంగా లిక్కర్ బ్రాండ్ల వంటి వివాదాలు తెరపైకి వస్తున్నాయి. ప్రభుత్వం నడపడం ఆషామాషీ కాదు. కానీ కనుసన్నలతో ప్రభుత్వాన్ని నడిపేవారు ఉంటారు. అతి కష్టం మీద నడిపేవారు ఉంటారు. ఏదో నడిచిపోతుందని అలా వదిలేసేవారు ఉంటారు. కానీ తమదైన ముద్ర వేయకపోతే.. ప్రజలు కూడా పవర్ ఫుల్‌గా గుర్తించరు. ఇలాంటివి మరికొన్ని జరిగితే.. రేవంత్ నాయకత్వ సామర్థ్యంపై విమర్శలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

# పోడు రైతుల భూములు రక్షణకు కృషి

## అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

జయశంకర్ భూపాలపల్లి, పోడు రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా, వారి ఉపాధికి భంగం కలగకుండా అటవీశాఖ మార్గదర్శకాలను అనుసరిస్తూ పోడు భూముల రక్షణకు కృషి చేయాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. అదే సమయంలో పోడు భూముల్లో సాగుచేసుకుంటున్న రైతు కుటుంబాలు సున్నితమైన పరిస్థితుల్లో అటవీశాఖ అధికారులకు ఎలాంటి హానీ తలపెట్టవద్దనీ, క్రమశిక్షణా చర్యలకు గురికావద్దని మంత్రి సురేఖ సూచించారు. శనివారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో పోడు భూముల సమస్యల పై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు సీతక్క, అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణి ప్రసాద్, అడిషనల్ సెక్రటరీ ప్రశాంతి, డిప్యూటీ సెక్రటరీ శ్రీలక్ష్మి, పిసిసిఎఫ్ డోబ్రియాల్, సిసిఎఫ్ లు భీమా నాయక్, ప్రభాకర్, డిఎఫ్‌ఓలు రాహుల్ కిషన్ యాదవ్, కిష్టాగౌడ్, సిద్దార్థ్ విక్రంసింగ్, విశాల్, నీరజ్ తదితరులు పాల్గొన్నారు. పోడు భూములను సాగుచేసుకుంటున్న రైతుల హక్కులను కాపాడడంలోనూ, అటవీశాఖ భూములను కాపాడే విధులను నిర్వర్తిస్తున్న అటవీ అధికారులకు రక్షణ కల్పించడంలోనూ ప్రభుత్వం ఎంతో సమన్వయంతో ముందుకు సాగుతున్నదని మంత్రి సురేఖ అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఏళ్ళుగా పోడు భూములను సాగుచేసుకుంటున్న రైతు కుటుంబాల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని, వ్యవసాయం పేరుతో మార్గదర్శకాలకు, చట్టాలకు విరుద్ధంగా కొత్తగా పోడు భూములను ఆధీనంలోకి తీసుకున్నట్లైతే కఠినచర్యలు చేపట్టాల్సి వస్తుందని మంత్రి సురేఖ హెచ్చరించారు. నిన్న నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కాల్పోల్ గ్రామంలో ఎఫ్‌ఆర్‌ఓ, సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్ ల పై గిరిజనులు చేసిన దాడిని మంత్రి సురేఖ ప్రస్తావించారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు ఎంత ప్రాధాన్యత ఇస్తామో, రాష్ట్ర అటవీ సంపద, సహజ వనరుల పరిరక్షణకు అంతే ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ హయాంలో అనర్హులకు పోడు భూముల కేటాయింపు జరిగిన విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పోడు భూముల పంపిణీ పై నివేదికను సమర్పించాలని మంత్రి సురేఖ అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, " వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పోడు భూములను సాగుచేసుకుంటున్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం వెదకాలని మంత్రి సీతక్క నాతో పలుమార్లు ప్రస్తావించారు. పోడు భూముల విషయంలో అటవీశాఖకు, రైతులకు మధ్య జరుగుతున్న సంఘర్షణలను నివారించేలా చర్యలు చేపట్టాలని, మార్గదర్శకాలు రూపొందించాలని కోరుతూ వచ్చారు. వీరి మధ్య జరిగే సంఘర్షణలతో ప్రభుత్వానికి మచ్చ రావద్దనే ఆలోచనతో ఈ సమస్యలకు పరిష్కారం వెదికేందుకు ప్రాథమికంగా నేడు సమావేశమయ్యాం. ఏళ్ళుగా కొనసాగుతున్న పోడు భూముల చిక్కు సమస్యను పరిష్కారం కనుగొనేందుకు ఈ సమావేశాన్ని ప్రాథమిక సమావేశంగా భావిస్తున్నాం " అని తెలిపారు. తాను ప్రతిపక్షంలో ఉన్నా, అధికార పక్షంలో ఉన్నా పోడు భూముల పై వివాదాలను చూస్తూనే ఉన్నానని మంత్రి సీతక్క అన్నారు. అటవీ ప్రాంతాల్లో కొత్తగా వెలుస్తున్న గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి అటవీశాఖ అభ్యంతరాలు వ్యక్తం చేసినా, ఏళ్ళుగా కొనసాగుతున్న గ్రామాల్లో అభివృద్ధి పనులను కొనసాగించేలా అధికారులకు ఆదేశాలివ్వాలని మంత్రి కొండా సురేఖను మంత్రి సీతక్క కోరారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, పథకాల అమలులో అటవీశాఖ మార్గదర్శకాలు ప్రతిబంధకాలుగా మారుతున్న నేపథ్యంలో ఈ దిశగా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమావేశాల్లో పోడు భూముల సమస్యను లేవనెత్తి, కచ్చితమైన పరిష్కారాన్ని రాబట్టేలా చర్యలు చేపట్టాలని కోరారు. పోడు భూములను సాగు చేసుకుంటున్న రైతుల విషయంలో అటవీశాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. అటవీ భూములను కాపాడుకుంటూనే, పోడు రైతులకు ప్రయోజనం కలిగేలా పోడు భూముల్లో ఉద్యానవన శాఖ మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలు చేపట్టి వారికి ప్రయోజనాలను కలిగించాలని కోరారు. ఫారెస్ట్ డెవలప్ మెంట కార్పోరేషన్ ఆధ్వర్యంలో పలు రకాల మొక్కలను పెంచడం, పామాయిల్ చెట్లను సాగు చేయడం వంటి చర్యలు చేపట్టడం ద్వారా పోడు రైతులకు ప్రయోజనాలను కలిగిస్తూనే ప్రభుత్వ లక్ష్యాలను సాధించవచ్చునని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. ఈ దిశగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఛత్తీసగఢ్ నుంచి రాష్ట్రంలోని వస్తున్న గిరిజనులు అటవీ భూములను ఆక్రమించుకుంటున్న విషయాన్ని అధికారులు మంత్రులకు వివరించారు. దీనికి మంత్రులు స్పందిస్తూ, " పక్క రాష్ట్రాల నుంచి గిరిజనులు మన ప్రాంతానికి వస్తే ఇక్కడ ప్రజల ప్రయోజనాలు దెబ్బతింటాయి. భవిష్యత్ లో ఇలాంటి వలసలు కొనసాగకుండా కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి కచ్చితమైన మార్గదర్శకాలను రూపొందించాలి. ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలు దెబ్బతినకుండా చూడాలి" అని అధికారులను ఆదేశించారు. భూ ఆక్రమణలను వందకు వందశాతం నిలువరిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలు వందకు వంద శాతం కొనసాగేలా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. అటవీశాఖ తమ భూములను లాక్కుంటుందనే పోడు రైతుల భ్రమలను తొలిగించేలా వారిలో నమ్మకాన్ని కలిగించేలా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖలతో నిరంతరం చర్చిస్తూ, సమావేశమవుతూ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగేలా కార్యాచరణను అమలుపరచాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని అధికారులకు మంత్ర సురేఖ సూచించారు. పోడు భూములతో ముడిపడి ఉన్న అన్ని శాఖలను నిరంతరం సమీక్షిస్తూ ఈ దిశగా కచ్చితమైన మార్గదర్శకాలకు త్వరలో రూపం ఇవ్వాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. అనంతరం ఈ వర్షాకాలంలో పచ్చదనం పెంపుదలలో భాగంగా చేపట్టాల్సిన కార్యకలాపాల పై అధికారులకు మంత్రి సురేఖ పలు సూచనలు చేశారు



# అక్రమ కట్టడాల కూల్చివేతపై బీజేపీ హర్షం

హైదరాబాద్: జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి మాతాజీ నగర్ ఎఫ్ టీ ఎల్ స్థలంలో వెలసిన అక్రమ కట్టడాలు కూల్చి వేయడం పట్ల బీజేపీ సీనియర్ నాయకుడు నందు హర్షం వ్యక్తం చేసారు. ప్రభుత్వ స్థలం కాపాడడం కోసం చేస్తున్న తమ పోరాటం ఎట్టకేలకు ఫలించిందని అన్నారు. జీహెచ్ఎంసి అధికారులు బేగంపేట్ ఎఫ్టీఎల్ స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన సందర్భంగా బీజేపీ నాయకుడు నందు మాట్లాడుతూ భూ బకాసూరులు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టి అమాయకులకు అమ్ముకుంటూ వాటికి ఇంటి నెంబర్లు, కరెంట్ మీటర్లు సైతం కల్పిస్తుంటే ప్రభుత్వ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఇదే విషయంపై రెండుసార్లు ఆర్ టీ ఐ వేసిన ప్రభుత్వం నుండి సమాధానం రాలేదని చెప్పారు. సర్వే నెంబర్. 194/8/1 దాదాపు ఆరు వందల కోట్ల విలువ చేసే 10ఎకరాల 20గుంటల స్థలాన్ని స్వాహా చేయడంలో అధికారులు, గత పరభుత్వ అధినేతల హస్తం కూడా ఉందని ఆరోపించారు. ఆ స్థలాలను కొన్న వారు తాము చెల్లించిన డబ్బులు నష్టపోయి ఇప్పుడు బాధితులుగా మారారని వెల్లడించారు. వారు తమ మొరను ప్రజాభవన్ ఆవరణలోనే వెళ్ళబోసుకున్నారని, అంతే కాకుండా ప్రజాప్రతినిధులకు వారిచ్చిన డబ్బుల గురించి కూడా చెబుతుండడం గమనార్హమని పేర్కొన్నారు. ఈ స్థలాన్ని కాపాడి ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా పార్కును, వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఇంటి నెంబర్లను, కరెంట్ మీటర్లను కేటాయింపులపై విచారణ జరిపి సంబంధిత అవినీతి అధికారులపైన కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# భర్త, ప్రియురాలిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న భార్య

హైదరాబాద్: హైదరాబాద్ అంబర్ పెట్ డిడి కాలనీలో మారో వివాహేతర సంబంధం రచ్చకెక్కింది. ప్రియురాలితో భర్త ఎంజాయ్ చేస్తుంటే భార్య రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుంది. ముషీరాబాద్ ఎస్ఆర్ టి కాలనీకి చెందిన ప్రవీణ్ తన ప్రియురాలితో ఉల్లాసంగా గడుపుతుండగా అతడిని భార్య మెర్సీ ఆమె పిల్లలు రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. తన భర్తతో ఎలా ఉంటావు అనిప్రవీణ్ ను ఆయన ప్రియురాలిని నిలదీసింది. ప్రియురాలిని అడ్డుకొని బార్య మెర్సీ కొడుకుని భర్త ప్రవీణ్ తీవ్రంగా కొట్టారు. సోషల్ మీడియాలో గొడవ వీడియో వైరల్ గా మారింది. కొన్ని నెలలుగా ప్రవీణ్ ప్రియురాలు తో అంబర్పేట్ లోని డిడి కాలనీలో సహజీవనం చేస్తున్నారు. యువతితో తన భర్త ప్రవీణ్ అక్రమ సంబంధం పెట్టుకున్నాడని భార్య అవేదన వ్యక్తం చేసింది. భర్త ప్రవీణ్ దాడి చేస్తుండగా భార్య మెర్సి పిల్లలు పోలీసులను ఆశ్రయించింది. ఘటనా స్థలాన్ని చేరుకున్న అంబర్పేట్ పోలీసులు ఇరువర్గాలను సముదాయించారు.

# దాడులు చేసేవారిపై చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్: అటవీ భూముల రక్షణలో భాగంగా నిర్వరిస్తున్న విధులకు భంగం కలిగిస్తూ, తమ పై దాడులకు దిగుతున్న వారి పై లా అండ్ ఆర్డర్ ప్రకారం చర్యలు చేపట్టి, తమకు భరోసా కలిగించాలని కోరుతూ తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ శనివారం అటవీశాఖ మంత్రి సురేఖ ని సచివాలయంలోని కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని సమర్పించింది. తమ ప్రాణాలకు రక్షణ కల్పించి, తమను ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు మంత్రి సురేఖన కోరారు. ఈ దిశగా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని, అటవీ అధికారులు, సిబ్బందికి ఏ సాయం కావాలన్నా సిద్ధంగా ఉంటామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. మంత్రి గారిని కలిసిన వారిలో తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ నాగేందర్ బాబు, వైస్ ప్రెసిడెంట్ బి. సాంబు, సెక్రటరీ ప్రశాంత్, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. శ్రీనివాస్ రెడ్డి, స్టేట్ జాయింట్ సెక్రటరీ పి.సుకన్య, కోశాధికారి బి. కోటేశ్వర్ రావు తదితరులున్నారు.

# ప్రభుత్వ ఉపాధ్యాయుని హత్య కేసులో ట్విస్ట్

అదిలాబాద్: అదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం లోకారి ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజేందర్ గత మూడు రోజుల క్రితం పాఠశాలకు వెళ్తుండగా దారుణ హత్యకు గురయ్యాడు.. స్కూల్స్ రీ ఓపెనింగ్ రోజే పాఠశాలకు వెళ్తున్న ఉపాధ్యాయుని హత్యకు సంబంధించి జిల్లా ఎస్పీ గౌస్ ఆలం విచారణ ముమ్మరం చేయగా పోలీసుల దర్యాప్తులో నమ్మలేని నమ్మలేని నిజాలు బయట పడుతున్నాయి.. మృతుని భార్య మరో వ్యక్తితో అక్రమ సంబంధం కొనసాగుతున్న నేపథ్యంలోని ముగ్గురు నిందితులకు 20 లక్షల రూపాయల సుపారి ఇచ్చి హతమార్చినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు.. బేల మండలానికి చెందిన ముగ్గురు అనుమానితులు పథకం ప్రకారం మోటార్ బైక్ పై వెళ్తున్న గజేందర్ ను అడ్డగించి ఖాళీ ప్రదేశంలోకి లాక్కెళ్ళి బండ రాళ్ళు, మారణ ఆయుధాల తో అతి కిరాతకంగా హతమార్చారు.. పతకం ప్రకారం భార్య, ప్రియుడితోకలిసి హత్య చేసినట్టుగా గుర్తించిన పోలీసులు ముగ్గురుని అదుపులో తీసుకున్నట్లు తెలుస్తోంది...

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే ఆరు నెలల జైలుశిక్ష

హైదరాబాద్ : మందుబాబులకు బిగ్ అలర్ట్. అయితే బహిరంగ ప్రదేశాల్లో మందు తాగుతున్నారా. అయితే ఇకపై మీరు జైలుకు వెళ్లాల్సిందే. విధులు మగించుకుని ఇంటికి వెళ్తూనో.. స్నేహితులతో సరదాగా మందు తాగుదామని అనుకుంటున్నారా.జరజాగ్రత్త. ఇంట్లోనే లేదా బార్‌లోనే కూర్చుని మద్యం సేవించండి. అలాకాదని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ పోలీసుల కంట పడ్డారో ఇక అంతే సంగతి. మీకు ఆరు నెలల జైలుశిక్ష తప్పదు.బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నేర మంటూ హెచ్చరిస్తూ పోలీసుశాఖ తమ అధికారిక ఎక్స్‌ఖాతాలో పోస్ట్ చేసింది.

# చరిత్ర సృష్టించిన న్యూజిలాండ్ పేసర్.. క్రికెట్ చరిత్రలోనే కనివిని ఎరుగని రికార్డ్!




న్యూజిలాండ్ పేసర్ లాకీ ఫెర్గూసన్ చరిత్ర సృష్టించాడు. క్రికెట్ చరిత్రలోనే కనివిని ఎరుగని రికార్డ్‌ను నమోదు చేశాడు. వరుసగా నాలుగు ఓవర్లు మెయిడిన్ చేసిన బౌలర్‌గా చరిత్రకెక్కాడు.
టీ20 ప్రపంచకప్ 2024లో భాగంగా పసికూన పపువా న్యూ గినియాతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో లాకీ ఫెర్గూసన్ ఈ ఫీట్ సాధించాడు. నాలుగు ఓవర్లలో ఒక్క పరుగు ఇవ్వకుండా 3 వికెట్లు తీసాడు. టీ20 ప్రపంచకప్‌తో పాటు పొట్టి క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ఎకానమీ నమోదు చేసిన ఆటగాడిగా అరుదైన ఫీట్ సాధించాడు. టీ20 క్రికెట్ చరిత్రలోనే ఇప్పటి వరకు మరే క్రికెటర్ కూడా ఈ ఫీట్ సాధించలేదు.
పపువా న్యూ గినియా ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో బంతిని అందుకున్న ఫెర్గూసన్ తొలి బంతికే వికెట్ తీసాడు. ఆ తర్వాతి ఐదు బంతులను కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి మెయిడిన్ చేశాడు. ఏడో ఓవర్‌లో మరోసారి బౌలింగ్ అందుకొని రెండోసారి మెయిడిన్ చేశాడు.మళ్లీ 12వ ఓవర్ బౌలింగ్ చేసిన ఫెర్గూసన్ రెండో బంతికి వికెట్ తీసి మూడో ఓవర్‌ను మెయిడిన్ చేశాడు. 14వ ఓవర్‌లో రెండో బంతికి మరో వికెట్ తీసి మరోసారి మెయిడిన్ చేశాడు. 2021లో కెనడా బౌలర్ సాద్ బిన్ పనామాతో జరిగిన మ్యాచ్‌లో వరుసగా నాలుగు ఓవర్లు మెయిడిన్ చేసి 2 వికెట్లు పడగొట్టాడు. తాజాగా ఫెర్గూసన్ నాలుగు ఓవర్లు మెయిడిన్ చేయడంతో పాటు 3 వికెట్లు పడగొట్టి అతని రికార్డ్‌ను బ్రేక్ చేశాడు. ఫెర్గూసన్ ధాటికి ముందుగా బ్యాటింగ్ పపువా న్యూ గినియా 19.4 ఓవర్లలో 78 పరుగులకు కుప్పకూలింది. చార్లెస్ అమిని(17), నోర్మన్ వానువా(14), సెసే(12) మినహా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్, టీమ్ సౌథీ, ఇష్ సోదీ రెండేసి వికెట్లు తీయగా.. ఫెర్గూస్ మూడు వికెట్లు పడగొట్టాడు. మిచెల్ సాంట్నర్‌కు ఓ వికెట్ దక్కింది.

# బంగ్లా ముందుకు.. డచ్ ఇంటికి

## నెదర్లాండ్స్‌కు నిరాశ
## ఘనవిజయంతో ముగించిన లంక



కింగ్‌స్టౌన్ (సెయింట్ విన్సెంట్): సూపర్-8 చేరాలంటే తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో బ్యాట్‌తో విఫలమైనా బంతితో ఆకట్టుకున్న బంగ్లాదేశ్.. తమ ఆఖరి లీగ్ పోరును విజయంతో ముగించింది. నేపాల్‌పై 21 పరుగుల తేడాతో గెలిచి తదుపరి దశకు అర్హత సాధించింది. ఈ టోర్నీలో ముందంజ వేయాలంటే భారీ విజయం సాధించాల్సిన దశలో నెదర్లాండ్స్.. శ్రీలంక చేతిలో చిత్తుగా ఓడటం బంగ్లాదేశ్‌కు కలిసొచ్చింది.
సోమవారం కింగ్‌స్టన్ వేదికగా నేపాల్‌తో జరిగిన గ్రూప్ డీ మ్యాచ్‌లో బంగ్లాదేశ్.. మొదట బ్యాటింగ్ చేస్తూ 19.3 ఓవర్లలో 106 పరుగులకే చేతులెత్తేసింది. నేపాల్ బౌలర్లు కట్టడి చేయడంతో బంగ్లా జట్టులో ఒక్కరైనా రెండంకెల స్కోరు చేయలేకపోయారు. షకిబ్ అల్ హసన్ (17) టాప్ స్కోరర్. నేపాల్ బౌలర్లలో సోంపల్ (2/10), లమిచానె (2/17), పౌడెల్ (2/20) రాణించారు.
గత మ్యాచ్‌లో సౌతాఫ్రికాతో ఒక్క పరుగు తేడాతో ఓడిన నేపాల్ ఈ మ్యాచ్‌లోనూ విజయానికి చేరువగా వచ్చింది. కానీ బౌలింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై బంగ్లా బౌలర్, 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' తాంజిమ్ హసన్ సకిబ్ (4/7) నిప్పులు చెరగగా ముస్తాఫిజుర్ రెహ్మాన్ (3/7) విజృంభించడంతో నేపాల్.. 19.2 ఓవర్లలో 85 పరుగులకే ఆలౌట్ అయింది. కుశాల్ (27), దీపేంద్ర (25) పోరాడారు.
లంకకు భారీ విజయం పొట్టి ప్రపంచకప్‌లో చెత్త ప్రదర్శనలతో తీవ్ర విమర్శలను ఎదుర్కుంటున్న శ్రీలంక తమ ఆఖరి మ్యాచ్‌లో మాత్రం అదిరిపోయే విజయంతో వీడ్కోలు పలికింది. సెయింట్ లూసియా వేదికగా నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లోలంక బ్యాటర్లు ఝూలు విదిల్చారు. కుశాల్ మెండిస్ (46), చరిత్ అసలంక (46), ధనంజయ డిసిల్వ (34) వీరవిహారం చేయడంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో నెదర్లాండ్స్.. 16.4 ఓవర్లలో 116 పరుగులకే చాపచుట్టేసి 83 పరుగుల తేడాతో ఓడింది. లెవిట్ (31), ఎడ్వర్డ్స్ (31) ఫర్వాలేదనిపించారు. నువాన్ తుషారా (3/24), పతిరాన (2/12) రాణించారు. అసలంకకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

# అదే జరిగితే.. టీ20 ప్రపంచకప్ నుంచి అర్ధాంతరంగా టీమిండియా ఔట్.?




టీ20 ప్రపంచకప్ 2024లో టీమిండియా అద్భుత ప్రదర్శన కనబరిచడమే కాదు.. గ్రూప్-స్టేజి నుంచి అదిరిపోయే మూడు విజయాలతో సూపర్-8 దశకు చేరుకుంది. సూపర్-8లో భారత్.. అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా జట్లతో అమీతుమీ తేల్చుకోనుంది. టోర్నీలో ఇప్పటివరకు ఓటమి ఎరగని టీమిండియా.. సూపర్-8లో ఏమేరకు రాణిస్తుందోనన్న ప్రశ్న ఫ్యాన్స్‌లో తలెత్తుతోంది. గత 8 టీ20 ప్రపంచకప్ ఎడిషన్లలో సూపర్-8 రౌండ్‌లో టీమిండియా అత్యంత చెత్త గణాంకాలను నమోదు చేసింది. దీంతో ఆ జ్ఞాపకాలు గుర్తు చేసుకున్న ఫ్యాన్స్.. ఈసారైన భారత్ అద్భుతంగా రాణించాలని.. లేదంటే అర్ధాంతరంగా ట్రోఫీ అందకుండానే టీమిండియా టోర్నీ నుంచి ఔట్ అవుతుందని కామెంట్స్ చేస్తున్నారు.
2007లో జరిగిన తొలి టీ20 ప్రపంచకప్ ఎడిషన్‌లో పాకిస్థాన్‌ను ఓడించి భారత్ తొలి టైటిల్‌ను కైవసం చేసుకుంది. దీని తర్వాత 2009లో రెండో ఎడిషన్‌లో భారత్ సూపర్-8లోకి ప్రవేశించింది. ఈ రౌండ్‌లో భారత్.. దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, వెస్టిండీస్ మూడు జట్లతో తలబడింది. అయితే ఈ మూడు జట్లపైనా టీమిండియా ఓడిపోయి.. చివరి స్థానంలో నిలవడమే కాకుండా.. అర్ధాంతరంగా టోర్నీ నుంచి నిష్క్రమించింది. 2010 టీ20 ప్రపంచకప్‌లోనూ ఇదే సీన్ రిపీట్ అయింది. ఆ టోర్నీలో గ్రూప్ సీలో భాగంగా భారత్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి సూపర్-8లోకి ప్రవేశించింది. ఆ తర్వాత సూపర్-8 రౌండ్‌లో ఆస్ట్రేలియా, శ్రీలంక, వెస్టిండీస్‌తో తలపడిన టీమిండియా.. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. దీంతో టీమిండియా టోర్నీ నుంచి ఔట్ అయింది.

2012లో షాకిచ్చిన నెట్ రన్ రేట్..

2009, 2010 ప్రపంచకప్‌ల మాదిరిగానే 2012 ప్రపంచకప్‌లోనూ భారత్ మరోసారి సూపర్-8 రౌండ్ నుంచే ఎగ్జిట్ అయింది. ఈ ప్రపంచకప్‌లో గ్రూప్ దశలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి భారత్ సూపర్-8లోకి ప్రవేశించింది. ఈ రౌండ్‌లో ఆస్ట్రేలియా, పాకిస్తాన్, దక్షిణాఫ్రికాతో తలబడిన భారత్.. పాక్, సఫారీలపై గెలిచి.. ఆస్ట్రేలియాపై ఓడిపోయింది. కానీ నెట్ రన్ రేట్ పరంగా పాకిస్థాన్ కంటే వెనుకబడి ఉండటంతో భారత జట్టు సూపర్-8 రౌండ్ నుంచి నిష్క్రమించింది.

ఈసారి పెద్ద సవాలే..

ప్రస్తుత ప్రపంచకప్‌లో భారత్ సూపర్-8 రౌండ్‌లో ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌తో తలపడనుంది. గడిచిన టీ20 మ్యాచ్‌ల గణాంకాలు పరిశీలిస్తే.. ఈ మూడు జట్లపై భారత్ అద్భుత ప్రదర్శన చేసింది. అయితే ప్రస్తుతం ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్థాన్‌ల ఫామ్.. టీమిండియాను భయపెడుతోంది. వీరిని ఓడించి భారత్ సెమీఫైనల్‌కు చేరాలంటే.. అంత ఈజీ ఏం కాదు. కాబట్టి ఈ రౌండ్‌లో భారత్ అన్ని విభాగాల్లోనూ మంచి ప్రదర్శన కనబరచాల్సిందే.

# 5 రోజుల్లో 3 మ్యాచులు!

## సూపర్8లో టీమ్ ఇండియాకు కఠిన షెడ్యూల్




బ్రిడ్జ్‌టౌన్ : ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా గ్రూప్ దశ మ్యాచులు ముగిశాయి. గ్రూప్-ఏలో మూడు విజయాలు సహా ఓ మ్యాచ్ రద్దు కావటంతో ఏడు పాయింట్లతో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. ఓటమెరుగని రికార్డుతో సూపర్8కు చేరుకుంది. గ్రూప్ దశలో మ్యాచ్‌కు మధ్య విరామం దక్కించుకున్న రోహిత్‌సేనకు సూపర్8లో అటువంటి అవకాశం లేకుండా పోయింది. సెమీఫైనల్లో చోటు సాధించేందుకు కీలక సూపర్8లో ఆడాల్సిన మూడు మ్యాచులను ఏకంగా ఐదు రోజుల వ్యవధిలోనే ఆడాల్సి ఉంది. ఈ మేరకు భారత్‌కు కఠిన షెడ్యూల్ ఎదురైంది. మూడు మ్యచులకు మధ్య విరామం అతి తక్కువగా ఉండటంతో నాకౌట్ మ్యాచులకు పేసర్ల ఫిట్‌నెస్‌పై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం కనిపిస్తోంది!.
సూపర్8లో భారత్ గ్రూప్-1లో నిలిచింది. ఇదే గ్రూప్‌లో అఫ్గనిస్థాన్, బంగ్లాదేశ్ సహా ఆస్ట్రేలియా సైతం చోటుచేసుకుంది. సూపర్8లో భారత్ తొలుత అఫ్గనిస్థాన్‌తో తలపడనుంది. ఆ తర్వాత బంగ్లాదేశ్, ఆస్ట్రేలియాలతో తాడోపేడో తేల్చుకోనుంది. కీలక సూపర్8 కావటంతో ఏ మ్యాచ్‌ను తేలిగ్గా తీసుకునే అవకాశం లేకుండా పోయింది. స్పిన్‌కు అనుకూలించే కరీబియన్ పిచ్‌లపై అఫ్గనిస్థాన్, బంగ్లాదేశ్‌లను ఎదుర్కొవాల్సి రావటం టీమ్ ఇండియాకు సవాల్‌తో కూడకున్నదే. గురువారం బ్రిడ్జ్‌టౌన్ వేదికగా (జూన్ 20) అఫ్గనిస్థాన్‌తో , శనివారం (జూన్ 22) నార్త్‌సౌండ్ వేదికగా బంగ్లాదేశ్, సోమవారం (జూన్ 24) గ్రాస్‌ఐలెట్ వేదికగా ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది. సూపర్ 8 మ్యాచుల కోసం టీమ్ ఇండియా ఇప్పటికే అమెరికా నుంచి కరీబియన్ దీవులకు చేరుకుంది.

# అభిమానితో గొడవ.. ట్రెండింగ్‌లో పాకిస్థాన్ పేసర్..



టీ20 వరల్డ్ కప్‌లో మాజీ చాంపియన్ పాకిస్థాన్ అనూహ్యరీతిలో ఇంటిదారి పట్టింది. టాపార్డర్ వైఫల్యం, గ్రూప్ రాజకీయాలు, సమిష్టితత్వం కొరవడడం వెరిసి లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది. పాక్ క్రికెకటర్ల చెత్త ప్రదర్శనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాబర్ సేన ఆటతీరు అభిమానులకు మింగుడు పడడం లేదు. ప్రస్తుతం అమెరికాలోనే ఉన్న పాక్ ఆటగాళ్లు ఎక్కడ కంటపడినా ఫ్యాన్స్ కడిగి పారేస్తున్నారు. తాజాగా పాకిస్థాన్ పేసర్ హ్యారిస్ రవుఫ్ సైతం ఇదే పరిస్థితి ఎదురైంది. దాంతో, చిర్రెత్తుకొచ్చిన అతడు ఒక అభిమానిపై గొడవకు దిగాడు. కోపంతో ఊగిపోయిన రవుఫ్ భార్య ముజ్నా మసూద్ మాలిక్ వారిస్తున్నా వినకుండా అతడి వైపు గబగబా వెళ్లాడు. దాంతో, ఏం జరుగుతుందోనని రవుఫ్ భార్య కంగారు పడింది. అయితే.. అక్కడే ఉన్న ఒకతను పాక్ స్పీడ్‌స్టర్‌ను అడ్డుకొని వెనక్కి పంపాడు. భారత అభిమాని అనుకొని..
అయినా సరే సదరు అభిమాని, రవుఫ్‌లు కాసేపు తిట్టుకున్నారు. అయితే.. గొడవకు అసలు కారణం ఏంటనేది మాత్రం తెలియలేదు. 'అతడు కచ్చితంగా భారతీయుడే అయి ఉంటాడు' అని రవుఫ్ అనడం వీడియోలో రికార్డు అయింది. అయితే.. సదరు అభిమాని 'నేను పాకిస్థానీ' అని బదులిచ్చాడు. దాంతో, రవుఫ్ కాస్త కూల్ అయ్యాడు.
వరల్డ్ కప్‌లో దారుణ ఓటమిపై ఆ అభిమాని రవుఫ్‌ను నిలదీసి ఉంటాడు. అందుకనే మనోడు చిర్రుబుర్రులాడి ఉంటాడు అని అందరూఅనుకుంటున్నారు. రవుఫ్ గొడవ పడుతున్న వీడియో సోషల్ మీడియాల్ ట్రెండ్ అవుతోంది.

# సూపర్ షకిబ్

- నేపాల్‌పై బంగ్లాదేశ్ ఘన విజయం
- సూపర్8కు చేరుకున్న బంగ్లా టైగర్స్




కింగ్‌స్టౌన్ : బంగ్లాదేశ్ టైగర్స్ గర్జించటంతో ఆ జట్టు ఐసీసీ టీ20 ప్రపంచకప్ సూపర్8కు అర్హత సాధించింది. నేపాల్‌పై 21 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన బంగ్లాదేశ్ గ్రూప్-డిలో రెండో స్థానంలో నిలిచి సూపర్8 దశకు చేరుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 19.3 ఓవర్లలో 106 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో విజయానికి అడుగు దూరంలో ఆగిపోయిన నేపాల్.. బంగ్లాదేశ్‌పై సైతం సంచల5 రోజుల్లో 3 మ్యాచులు!
న విజయంపై కన్నేసింది. బంగ్లాదేశ్‌ను 106 పరుగులకే కూప్పకూల్చి ఆ దిశగా ఓ అడుగు ముందుకేసింది. బంగ్లాదేశ్ తరఫున షకిబ్ అల్ హసన్ (17, 22 బంతుల్లో 2 ఫోర్లు), మహ్మదుల్లా (13, 13 బంతుల్లో 2 ఫోర్లు), జేకర్ అలీ (26 బంతుల్లో 12), లిటన్ దాస్ (10, 12 బంతుల్లో 1 ఫోర్) రెండెంకల స్కోరు అందుకున్నారు. ఆఖర్లో రిషద్ హుస్సేన్ (13, 7 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), టస్కిన్ అహ్మద్ (12 నాటౌట్, 15 బంతుల్లో 2 ఫోర్లు) ధనాధన్‌తో బంగ్లాదేశ్ వంద పరుగుల మార్క్ దాటింది. నేపాల్ బౌలర్లలో సోంపాల్ (2/10), దీపేంద్ర సింగ్ (2/22), రోహిత్ (2/20), సందీప్ (2/17) రెండేసి వికెట్లతో మెరిశారు. ఇక ఊరించే స్వల్ప ఛేదనలో నేపాల్ చతికిల పడింది. బంగ్లాదేశ్ పేసర్ హసన్ షకిబ్ (4/7), ముస్తాఫిజుర్ రెహమాన్ (3/7), షకిబ్ అల్ హసన్ (2/9) వికెట్ల వేటలో విజృంభించారు. 19.2 ఓవర్లలో నేపాల్‌ను 85 పరుగులకే కుప్పకూల్చారు. టాప్ ఆర్డర్‌లో ఆసిఫ్ షేక్ (17) సహా మిడిల్ ఆర్డర్‌లో కుశాల్ మల్ల (27, 40 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్),దీపేంద్ర సింగ్ (25, 31 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించినా.. సహచర బ్యాటర్లు చేతులెత్తేశారు. అనిల్ (0), రోహిత్ (1), సందీప్ (1), గుల్షన్ (0), సోంపాల్ (0), సందీప్ (0 నాటౌట్) తేలిపోయారు. బంగ్లాదేశ్ పేసర్ షకిబ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. ఈ మ్యాచ్‌తో గ్రూప్-డి మ్యాచులు సైతం ముగిశాయి. గ్రూప్-డి నుంచి దక్షిణాఫ్రికా నాలుగు విజయాలతో అగ్రస్థానం సాధించగా.. బంగ్లాదేశ్ మూడు విజయాలతో రెండో స్థానం సాధించి సూపర్8కు చేరుకుంది. మూడు పరాజయాలతో నేపాల్ చివరి స్థానంతో సరిపెట్టుకుంది.

# అమిత్ షాతో గంభీర్ భేటీ.. టీమ్‌ఇండియా కోచ్‌గా ఫిక్స్!



ఢిల్లీ: భారత క్రికెట్ జట్టు మాజీ ఆటగాడు గౌతం గంభీర్ సోమవారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యాడు. టీమ్‌ఇండియా హెడ్‌కోచ్ రేసులో గంభీర్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్న నేపథ్యంలో గౌతి.. షాతో సమావేశమవడం ప్రాధాన్యత సంతరించుకుంది. వీరి భేటీ అనంతరం గంభీర్ తన ఎక్స్ (ట్విటర్) ఖాతాలో స్పందిస్తూ.. హోంమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సాధారణ ఎన్నికల్లో గెలిచినందుకు శుభాకాంక్షలు తెలిపానని వెల్లడించాడు.
ఇదిలాఉండగా 'మెన్ ఇన్ బ్లూ'కు ప్రధాన కోచ్‌గా గంభీర్ పేరు దాదాపు ఖాయమైనట్టేనని, అధికారిక ప్రకటన మాత్రమే మిగిలున్నదని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు గంభీర్ పెట్టిన షరతులకు (సహాయక కోచింగ్ సిబ్బంది నియామకంలో పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని) బీసీసీఐ పచ్చజెండా ఊపిందని బోర్డు వర్గాలు తెలిపాయి. ఇందులో భాగంగానే ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌కు ఫీల్డింగ్ కోచ్‌గా ఉన్న జాంటీ రోడ్స్‌ను భారత జట్టుకు తీసుకురానున్నట్టు సోమవారం సోషల్ మీడియాలో వార్త వైరల్ అయింది. గంభీర్, రోడ్స్.. రెండేండ్ల పాటు లక్నో జట్టుకు సేవలందించిన విషయం విదితమే.

# గంభీర్‌ను ఇంటర్వ్యూను చేయనున్న బీసీసీఐ..

గౌతమ్ గంభీర్ టీమ్ ఇండియా హెడ్ కోచ్ అవ్వడం దాదాపు ఖాయమైంది. నివేదికల ప్రకారం, భారత జట్టు ప్రధాన కోచ్ పదవికి గౌతమ్ గంభీర్ మాత్రమే దరఖాస్తు చేసుకున్నాడు.
బీసీసీఐ నేడు అతనిని ఇంటర్వ్యూ చేయనుంది.
ప్రస్తుతం టీమిండియా ప్రధాన కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ ఉన్న సంగతి తెలిసిందే. అతని నాయకత్వంలో, భారత జట్టు %u%20 ప్రపంచ కప్ 2024లో పాల్గొంటోంది. ఈసారి అమెరికా, వెస్టిండీస్ సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. అయితే టీ20 ప్రపంచకప్ ముగిసిన తర్వాత టీమిండియా ప్రధాన కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ పదవీకాలం కూడా ముగియనుంది. దీని తర్వాత, గౌతమ్ గంభీర్‌ను టీమిండియా తదుపరి ప్రధాన కోచ్‌గా నియమించవచ్చు. అనేక మీడియా నివేదికల ప్రకారం, ప్రధాన కోచ్ పదవి కోసం చాలా మంది మాజీ క్రికెటర్లను సంప్రదించారు. అయితే వారిలో ఎక్కువ మంది నిరాకరించారు. ఈరోజు గౌతమ్ గంభీర్ ఇంటర్వ్యూ..




ఈ క్రమంలో గౌతమ్ గంభీర్ పేరు తెరపైకి వచ్చింది. అతను ఈ రేసులో అగ్రగామిగా నిలిచాడు. గౌతమ్ గంభీర్ నాయకత్వంలో కోల్‌కతా నైట్ రైడర్స్ %ఖూా% 2024 టైటిల్‌ను గెలుచుకుంది. ఈ క్రమంలో గౌతమ్ గంభీర్ పేరు తొలి ప్రాధాన్యతను దక్కించుకుంది. టీమిండియా హెడ్ కోచ్ పదవికి దరఖాస్తు చేయడంతో.. బీసీసీఐ అతడిని ఈరోజు ఇంటర్వ్యూ చేయనుందని వార్తలు వస్తున్నాయి. ఆ తర్వాత టీమిండియా హెడ్ కోచ్‌గా ప్రకటిస్తారని తెలుస్తోంది. టీమిండియా ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ నియామకాన్ని జూన్ నెలాఖరులోగా ప్రకటించవచ్చని గతంలో వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో గంభీర్ ఇంటర్వ్యూకు సంబంధించిన వార్తలు వస్తున్నాయి.
గౌతమ్ గంభీర్ స్వయంగా టీమ్ ఇండియా హెడ్ కోచ్ కావాలనే తన కోరికను వ్యక్తం చేశాడు. ఇంతకంటే గొప్ప గౌరవం మరొకటి ఉండదంటూ చెప్పుకొచ్చాడు. గత పదేళ్లుగా టీమ్‌ఇండియాకు ఐసీసీ టైటిల్ దక్కలేదు. చాలా మంది కోచ్‌లు వచ్చినా ఐసీసీ టోర్నీలో జట్టును గెలిపించలేకపోయారు. మరి రాహుల్ ద్రవిడ్ సారథ్యంలోని టీమిండియా ఈసారి టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకుంటుందా లేదా అనేది చూడాలి.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**